# క్రైమ్ మిర్రర్ ®

Voice of Anti Corruption

హైదరాబాద్
3-7-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 101

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




# మరో 200 కోట్ల అవినీతి అధికారి!


## ఏసీబీకి చిక్కిన డీఎస్పీ భీమ్ రెడ్డి

## భారీగా వెలుగులోకి అక్రమార్జన

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ అవినీతి అధికారుల గుండెల్లో ఏసీబీ రైళ్లు పరుగెత్తిస్తోంది. ఏసీబీ మరో భారీ ఆపరేషన్కు శ్రీకారం చుట్టింది. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారని పక్కా సమాచారంతో పోలీస్ శాఖకు చెందిన కీలక అధికారి, డీఎస్పీ భీమ్ రెడ్డి నివాసాలు, కార్యాలయాలపై ఏకకాలంలో దాడులు చేసింది. గురువారం ఉదయం నుంచి మెగా సోదాలు నిర్వహిస్తోంది. హైదరాబాద్, మహబూబ్నగర్, నల్గొండ తో పాటు పొరుగు

- మిగతా 3వ పేజీలో

# కాంగ్రెస్‌కు పవన్ భయం!



## మెగా కుటుంబానికి ప్రాధాన్యం వెనుక రేవంత్ వ్యూహం

## డామేజ్ కంట్రోల్ కోసమే సురేఖ, ఉపాసన నియామకం

**తెలంగాణ రాజకీయాల్లో ఇటీవల పవన్ కళ్యాణ్ దూకుడు పెంచిన సంగతి తెలిసిందే. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున జనసేన కార్యక్రమానికి అనుమతి నిలిపివేసింది కాంగ్రెస్ సర్కార్. అయితే అదే రోజు మీడియా సమావేశంలో మాట్లాడి కాంగ్రెస్ పార్టీ తీరుపై విరుచుకుపడ్డారు పవన్ కళ్యాణ్.**

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** అటు తరువాత జనసేన తెలంగాణలో మరింత దూకుడుగా వ్యవహరించింది. అయితే బిజెపి లైన్లోనే పవన్ మాట్లాడుతున్నారు అంటూ కాంగ్రెస్ అనుమానించింది. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో పవన్ బిజెపి కి మద్దతుగా ఉంటారని అంచనా వేసింది. ఈ క్రమంలో రేవంత్ రెడ్డి భారీ వ్యూహం పన్నారు.

**సురేఖ నియామకం వెనుక..** యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా మెగాస్టార్ చిరంజీవి సతీమణి సురేఖను నియమించారు. దీని వెనుక గట్టి ప్రణాళిక ఉంది. గతంలో ఏ కమిటీ లో కూడా సురేఖ లేరు. రాజకీయ వేదికలపై ఆమె కనిపించిన దాఖలాలు లేవు. అయినా సరే ఆమెకు ఛాన్స్ ఇచ్చారు.

- మిగతా 2వ పేజీలో

## ధాన్యం కొనుగోళ్లలో

# గోల్ మాల్!

**గతంలో ఏసీబీకి చిక్కిన అధికారికి విచారణ బాధ్యతలు**

**ఆందోళనలో రాజన్న సిరిసిల్ల రైతులు**

- మిగతా 2వ పేజీలో




# మూసీ సుందరీకరణ ప్రాజెక్టు మొదటి దశకు ఆమోదం

## రూ.7,345కోట్లతో మొదటి దశ పనులకు గ్రీన్ సిగ్నల్

వీబీ జీరామ్‌జీ పథకాన్ని అమలు చేస్తూనే కోర్టులో సవాల్

ఇక స్కూళ్లు, కాలేజీల్లో టీచర్లకు కూడా మధ్యాహ్న భోజనం

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో మొత్తం 6,278 పోస్టుల మంజూరు

గిడ్డంగులు, నవోదయ విద్యాలయాలకు పలుచోట్ల భూ కేటాయింపులు

3లో

# కవిత దూకుడు!

తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలకు 250 గజాల స్థలాలు ఇవ్వాలని డిమాండ్

రోడ్డుపై భారీ ఆందోళన

గులాబీ పార్టీలో కొత్త చర్చ





# మావిగన్ మా రాజకీయ ఎజెండా

ఇదే అంశంతో ఎన్నికలు వెళతాం

మేనిఫెస్టోలనూ పెడతామన్న జగన్

విజయవాడనే ఇప్పుడు రాజధాని అంటూ ప్రకటన

జగన్ ప్రకటనలతో వైసిపిలో గందరగోళం

**విజయవాడ,(క్రైమ్ మిర్రర్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని స్థాపన అంశంపై ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి

2లో




# పొలిటికల్ షో!

## కాంగ్రెస్ వర్సెస్ బిఆర్ఎస్

## రోజంతా నడిచిన హైడ్రామా

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** ప్రజా సమస్యల విషయంలో ప్రతిపక్షం పోరాటం చేయాలి. అధికార పక్షం పై ఒత్తిడి తేవాలి. కానీ తెలంగాణలో మాత్రం అందుకు విరుద్ధంగా ఉంది పరిస్థితి. కేవలం పొలిటికల్ మైలేజ్ కోసమే గులాబీ పార్టీ పోరాటాలు అన్నట్టు ఉంది. రాష్ట్ర అప్పుల భారం, గురుకుల

# 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యం

## పాలనలో విస్తృతంగా సాంకేతికత వినియోగం

ఐటీ నుంచి ఏఐ వరకు ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యం

పేదలు, ధనికుల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు పి4 కార్యక్రమం

స్వర్ణాంధ్ర 2047 ఎకనమిక్ ఇంటెలిజెన్స్ ఫర్ గవర్నెన్స్' లో చంద్రబాబు

**తిరుపతి,(క్రైమ్ మిర్రర్):** 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో తిరుపతిలో రెండు రోజుల

3లో



# బ్లాక్ మనీని వైట్‌గా మారుస్తామని మోసం

అమాయకులకు డబ్బు ఆశ చూపి దోపిడీ

పోలీసుల వేషంలో బెదరించి లూటీలు

సత్తపల్లి గంగారాం డెకాయిటీ కేసును ఛేదించిన పోలీసులు

12 మంది నిందితుల అరెస్ట్..మరో ఇద్దరి కోసం గాలింపు

దోపిడీదారుల్లో ఇద్దరు కానిస్టేబుళ్లు ఉన్నట్లు గుర్తింపు

## బార్బీక్యూనేషన్ రెస్టారెంట్‌లో కంపు

### కుళ్ళిన ఆహారా పదార్థాలు స్వాధీనం

### గతంలో హెచ్చరించినా అదే తంతు

### చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

హైదరాబాద్:హైదరాబాద్ ఉప్పరపల్లిలోని బార్బిక్యూనేషన్ రెస్టారెంట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలతోపాటు, పాడైపోయిన చికెన్, మటన్, ఫిష్, ఐస్‌క్రీమ్స్, పండ్లు వంటి పదార్థాలను ఫ్రిడ్జ్‌లో నిల్వ చేసినట్లు గుర్తించారు. పాడైన మాంసంపై స్టిక్కర్లను మార్చి వినియోగిస్తున్నట్లు గుర్తించారు. కిచెన్ అపరిశుభ్రంగా ఉన్నట్లు ఫుడ్ సేఫ్టీ అధికారి తెలిపారు. గతంలో ఇలానే తనిఖీలు చేసినప్పుడు నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలగా.. తీరు మార్చుకోవాలని సూచించినట్లు చెప్పారు. అయినా రెస్టరంట్ యాజమాన్యం తీరు మారలేదని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించినందుకు జరిమానా విధించినట్లు తెలిపారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీల్లో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. తనిఖీల్లో కుళ్లిపోయిన, గడువు ముగిసిన చికెన్, మటన్, చేపలు, ప్రాన్స్, కేక్‌లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఏ ఐటమ్ చెక్ చేసినా పరిస్థితి అలాగే ఉండటంతో అధికారులు షాకయ్యారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలపై ఉన్న ఎక్స్‌పైరీ తేదీలను మార్చి, కొత్త తేదీలు ముద్రించి వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడేలా ఆహార పదార్థాలను నిల్వ చేసి వినియోగిస్తున్నట్లు తనిఖీల్లో వెల్లడైందని ఫుడ్ సేఫ్టీ అధికారి సౌమ్య తెలిపారు. ఇలాంటి ఉల్లంఘనలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. గతంలో కూడా ఇదే రెస్టారెంట్‌పై తనిఖీలు నిర్వహించినప్పటికీ యాజమాన్యం తీరులో మార్పు కనిపించలేదని అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## కాంగ్రెస్‌కు పవన్ భయం!



ఇప్పటికే స్పోర్ట్స్ హబ్ వైస్ చైర్మన్ గా రామ్ చరణ్ భార్య ఉపాసన నియమితులయ్యారు. ఇలా మెగా ఫ్యామిలీకి రేవంత్ సర్కార్ ప్రాధాన్యతపై ఇప్పుడు తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్లో చర్చ నడుస్తోంది. తెలంగాణలో ఇటీవల జనసేన కార్యాలయాన్ని ప్రారంభించారు పవన్ కళ్యాణ్. కచ్చితంగా బిజెపి జనసేనతో పొత్తు పెట్టుకోనుంది. అందుకే మెగా అభిమానుల్లో సానుకూల తప్పించుకునేందుకు రేవంత్ మెగా ఫ్యామిలీని పావుగా వాడుకున్నారని అర్థం అవుతోంది.

**జనసేన దూకుడు...**

తెలంగాణలో జనసేనలో చేరికలను ప్రోత్సహించాలని భావిస్తున్నారు పవన్ కళ్యాణ్. ఇందుకుగాను ఓ ఐదుగురితో ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేశారు. దీంతో భారీగా చేరికలు ఉండబోతున్నాయి అన్న టాక్ వినిపిస్తోంది. అదే జరిగితే అధికార కాంగ్రెస్ పార్టీకి నష్టం. బిజెపి ప్లాన్ లో భాగంగానే పవన్ ఇలా దూకుడు పెంచారు అనేది కాంగ్రెస్ పార్టీ అనుమానం. అందుకే కాంగ్రెస్ పార్టీ నేతలు పవన్ కళ్యాణ్ పై విమర్శలు చేస్తూ వచ్చారు. పవన్ సైతం జాతీయస్థాయిలో కాంగ్రెస్ పార్టీని తీవ్రంగా తప్పుపడుతూ వస్తున్నారు. ఈ పరిణామాల క్రమంలో మెగా ఫ్యామిలీ ద్వారా తమ పొలిటికల్ డామేజ్ ను తగ్గించుకునేందుకు రేవంత్ సర్కార్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారని స్పష్టంగా అర్థం అవుతోంది. మరి రేవంత్ ప్రయత్నాలు ఎంతవరకు వర్కౌట్ అవుతాయో చూడాలి.

## కవిత దూకుడు!

(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** టీఆర్ఎస్ అధినేత్రి కవిత పోరాట బాట పట్టారు. తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినట్లుగా 250 గజాల ఇళ్ల స్థలాలను వెంటనే కేటాయించాలని డిమాండ్ చేస్తూ భూ పోరాటం చేపట్టారు. ముందస్తుగా ఉప్పల్ బగాయత్తులో తలపెట్టిన భూ పోరాట సభను పోలీసులు అర్ధాంతరంగా అడ్డుకున్నారు. అయితే ఎలాగైనా నిరసన తెలిపి తీరుతామని కవిత తన రూటు మార్చారు. సభా వేదికను మేడిపల్లి– చెంగిచెర్ల, బోడుప్పల్ సరిహద్దులోని బగాయత్ నగర్ కు మార్చి.. అక్కడ భూ పోరాటం నిర్వహించేందుకు పార్టీ శ్రేణులతో కలిసి దూసుకెళ్లారు.

**స్వల్ప గాయాలు..**

కవిత నేతృత్వంలోని టిఆర్ఎస్ కార్యకర్తలు ఆందోళన చేస్తుండగా వందలాది మంది పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, తెలంగాణ రక్షణ సేన కార్యకర్తలకు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. తోపులాటకు దారితీసింది. పోలీసులు బలవంతంగా ఆందోళనకారులను చెల్లాచెదురు చేసే క్రమంలో.. కవిత కిందకు పడిపోయారు. స్వల్ప గాయాలకు గురయ్యారు. అనంతరం నాటకీయ పరిణామాల నడుమ కవితను బలవంతంగా వాహనంలోకి ఎక్కించి.. అదుపులోకి తీసుకొని బొల్లారం పోలీస్ స్టేషన్ కు తరలించారు.

**ఒంటరి పోరాటం పై చర్చ..**

కవిత ఒంటరి పోరాటంపై ఇప్పుడు తెలంగాణ పొలిటికల్ సర్కిల్లో కొత్త చర్చ మొదలైంది. వందలాది మంది పోలీస్ బలగాలను లెక్కచేయకుండా.. కాంగ్రెస్ ప్రభుత్వం పై ఒంటరి పోరాటం చేస్తున్న కవిత గురించి గులాబీ పార్టీలో ఇప్పుడు చర్చ మొదలైంది. అరెస్ట్ అవుతానని తెలిసినా నడిరోడ్డుపై బైఠాయించి లాఠీలకు ఎదురొడ్డిన కవిత పోరాట పటిమను చూసిన కొందరు కార్యకర్తలు, తాము ఇంతకాలం ఇలాంటి వీధి పోరాటాలను మిస్సయ్యా అంటూ సెటైర్లు వేస్తున్నారు. ప్రధానంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శైలికి, సొంత పార్టీ పెట్టుకున్న కవిత దూకుడుకు స్పష్టమైన తేడా కనిపిస్తోందని గులాబీ పార్టీ క్యాడర్ మదనపడుతోంది.

**కేటీఆర్ పోరాటాన్ని గుర్తుచేస్తూ..**

కవిత పోరాటానికి, కేటీఆర్ పోరాటానికి మధ్య తేడాను ఇప్పుడు చర్చిస్తున్నారు గులాబీ పార్టీ నేతలు. కేటీఆర్ పార్టీ బాధ్యతలు తీసుకొని... ప్రెస్మీట్లోనూ, సోషల్ మీడియా ట్విట్ లలోను కాంగ్రెస్ ప్రభుత్వం పై పదునైన విమర్శలు గుప్పిస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో ఈ స్థాయిలో నడిరోడ్డుపై వచ్చి ఆందోళన చేయడం ఎన్నడూ చూడలేదు. కవిత మాత్రం ఈ విషయంలో దూకుడుగా ఉన్నారు. మొదటి నుంచి క్షేత్రస్థాయి గొంతుకగా మారి.. నేరుగా రోడ్డు ఎక్కి అరెస్టులకు వెనుకాడకుండా ఉద్యమ స్టైల్లో పోరాటాలు చేస్తున్నారు.

## తెలంగాణ పోలీస్ శాఖ కీలక నిర్ణయం

### మాజీ డిజిపిలకు బుల్లెట్‌ప్రూఫ్ వాహనాల తొలగింపు

### అలాగే భారీగా భద్రత కూడా తగ్గిస్తూ ఆదేశాలు

హైదరాబాద్,జూలై2:తెలంగాణ పోలీస్ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. మాజీ డీజీపీలతో పాటు ప్రస్తుతం కీలక పోస్టులలో ఉన్న పోలీస్ అధికారులకు బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయంతో మాజీ పోలీస్ అధికారులకు బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు తొలగించనున్నారు. 20 మంది మాజీ పోలీస్ ఉన్నతాధికారులతోపాటు ప్రస్తుత అధికారులకు బుల్లెట్ వాహనాలు తీసివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మాజీ డీజీపీలు స్వరజిత్ సేన్, ఏకే ఖాన్, ఏకే మహంతి, దినేష్ రెడ్డి, జితేందర్, మహేందర్ రెడ్డి, అనురాగ్ శర్మ, పూర్ణచందర్రావు, కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి, నవీన్ ఛంద్, డానియల్, వెంకట్రామిరెడ్డి, స్టీఫెన్ రవీంద్ర, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, డీటి నాయక్, ఉమేష్ షరీఫ్, రవి గుప్తా. ఇంటెలిజెన్స్ చీఫ్ విజయకుమార్ మొదలైన అధికారులకు బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. మాజీ అధికారులతో పాటు ప్రస్తుత అధికారులకు కూడా ఈ నిర్ణయం వర్తించేలా ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ లకు బులెట్ ప్రూఫ్ వాహనాలను తీసివేశారు. మాజీ డీజీపీలకు ఉన్న ఎస్కార్ట్ వాహనాలను సైతం తీసివేసింది పోలీస్ శాఖ.పలువురు రాజకీయ నేతలతో పాటు పోలీసు అధికారులకు ఉన్న గన్ మెన్‌ల సంఖ్య తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో గోల్ మాల్!

(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** గతంలో కోట్లాది రూపాయల అవినీతి ఆరోపణలతో ఏసీబీకి చిక్కారు ఆ ఉన్నతాధికారి. ఇప్పుడు ఏకంగా ఆదికారిని ధాన్యం కుంభకోణం కేసులో విచారణ అధికారిగా నియమించడం నివ్వెర పరుస్తోంది. ఈ విచిత్ర పరిణామం సిరిసిల్ల జిల్లాలో కలకలం రేపుతోంది. ఒక అవినీతి మరక ఉన్న అధికారి నిష్పక్షపాతంగా విచారణ జరిపి నిజాలు బయట పెడతారా? అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

**అప్పట్లో మెదక్ లో ఉన్నప్పుడు..**

గతంలో మెదక్ జిల్లా అడిషనల్ కలెక్టర్ గా పని చేసిన గడ్డం నగేష్.. 2020లో ఓ భూమికి సంబంధించి ఎన్వోసీ ఇచ్చేందుకు ఏకంగా రూ. 1.12 కోట్ల లంచం డిమాండ్ చేసి.. ఏకంగా ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు. నాటి దాడుల్లో ఆయన బినామీల పేరుతో రాసుకున్న భూమి పత్రాలు, కాళీ చెక్కులు కూడా సీజయ్యాయి. ఆ కేసులో ఆయన అరెస్టయ్యారు. జైలు జీవితం అనుభవించారు. తరువాత సస్పెన్షన్ వేటు పడింది. కానీ తనకున్న పలుకుబడితో లూప్ లైన్ లో పోస్టింగ్ సంపాదించుకున్నారు. ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్గా కీలక బాధ్యతల్లో ఉన్నారు. తాజాగా జిల్లాను కుదిపేస్తున్న ఓ పెద్ద అవినీతిని తేల్చే బాధ్యతను ఆయనకు కట్టబెట్టడం విమర్శలకు తావిస్తోంది.

**భారీగా ధాన్యం మాయం..**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల నుంచి దాదాపు రూ.91 లక్షల విలువైన ధాన్యం బస్తాలు మాయమయ్యాయి. నకిలీ పత్రాలతో లూటీ చేయడం కలకలం సృష్టించింది. అయితే దీని వెనుక రాజకీయ నాయకులు, కొందరు మిల్లర్ల హస్తం ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కేసులో లోతుగా దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వాల్సిందిగా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ను కలెక్టర్ ఆదేశించారు. అయితే ఒక వైపు కోర్టులో సదరు అధికారిపై ఏసీబీ కేసులు నడుస్తున్నాయి. ఇప్పుడు అటువంటి అవినీతి కేసు బాధ్యతను ఆయనకు అప్పగించడం ఏంటని ప్రశ్న వినిపిస్తోంది. ఇలాంటి వివాదాస్పద అధికారులకు కీలక విచారణల బాధ్యతలు అప్పగించడం పై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నేరుగా స్పందించాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

## బ్లాక్ మనీని వైట్‌గా మారుస్తామని మోసం



ఖమ్మం,జూలై2(ఆర్ఎన్ఎ): బ్లాక్‌మనీని వైట్‌గా మారుస్తామని అమాయకులకు ఆశ చూపించి.. అనంతరం పోలీసుల వేషంలో బెదిరించి నగదు దోచుకున్న ముఠాను సత్తుపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని గంగారంలో జరిగిన సంచలన డెకాయిటీ కేసును పోలీసులు విజయవంతంగా ఛేదించారు. కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ ఆధ్వర్యంలోని సత్తుపల్లి పోలీస్ ప్రత్యేక బృందాలు ఈ కేసులో ముమ్మర దర్యాప్తు జరిపి మొత్తం 12 మంది నిందితులను అరెస్ట్ చేశారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులే ఈ దోపిడీ ముఠాలో భాగస్వాములు కావడం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. అరెస్టైన వారిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించగా, ఈ కేసులో ప్రమేయం ఉన్న మరో ఇద్దరు నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. ఈ కేసులో 14 మంది నిందితుల్లో 12 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ తెలిపారు. సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె కేసు వివరాలను వెల్లడించారు. నిందితుల్లో ఓ కానిస్టేబుల్, ఆర్ఎస్సై కూడా ఉన్నట్లు తెలిపారు. ఏసీపీ కథనం ప్రకారం.. గత నెల 25న కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన కుర్రా గంగాధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు సత్తుపల్లి పట్టణ సీఐ టి. శ్రీహరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో గంగారం శివారులో నిర్వహిస్తున్న తనిఖీల్లో 12 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా అసలు విషయం తెలిసింది. దర్యాప్తులో ఏలూరు జిల్లా వెంకటాపురానికి చెందిన ఈద చంటిబాబు ఈ ముఠా సూత్రధారిగా గుర్తించారు. అతడు మరో 13 మందితో కలిసి వివిధ సిమ్‌కార్డుల ద్వారా అమాయకులకు ఫోన్ చేసి, తాము రియల్ ఎస్టేట్ వ్యాపారులమని.. తమ వద్ద ఉన్న బ్లాక్‌మనీని వైట్‌మనీగా మార్చుకోవాల్సి ఉందని నమ్మించేవారు. రూ. 10 లక్షలు ఇస్తే రూ. 40 లక్షలు ఖాతాలో జమ చేస్తామని ఆశ చూపించి బాధితులను నిర్ణయించిన ప్రాంతానికి రప్పించేవారు. బాధితులు నగదు తీసుకొచ్చిన తర్వాత డమ్మీ కరెన్సీ నింపిన బ్యాగును ఇచ్చేవారు. అదే సమయంలో ముందస్తు ప్రణాళిక ప్రకారం ముఠాలోని కొందరు నిజమైన పోలీసులు.. నకిలీ పోలీసులతో అక్కడికి చేరుకుని దాడి చేసేవారు. నకిలీ కరెన్సీ వ్యాపారం చేస్తున్నారంటూ బెదిరించి బాధితుల వద్ద ఉన్న నగదును లాక్కొని పరారయ్యేవారు. ఇదే తరహాలో పలు ప్రాంతాల్లో మోసాలకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. ఈ కేసులో టీజీఎస్పీ 15వ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుల్ ముళ్లగిరి వర్ధన్, ఆర్ఎస్సై బైరా కేశవరావు ప్రమేయం ఉన్నట్లు గుర్తించామని ఏసీపీ తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ. 17.60 లక్షల నగదు, మూడు కార్లు, ఓ స్కూటీ, సెల్‌ఫోన్లు, పోలీసు దుస్తులు, బేడీలు, డమ్మీ కరెన్సీ నోట్ల బండిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు. కేసును ఛేదించిన సత్తుపల్లి సీఐ టి. శ్రీహరి ఆధ్వర్యంలోని పోలీసు బృందాన్ని ఏసీపీ అభినందించి రివార్డులు అందజేశారు. ప్రజలు బ్లాక్‌మనీ మార్పిడి పేరుతో వచ్చే ఫోన్‌కాల్స్, భారీ లాభాల ఆఫర్లను నమ్మవద్దని, అనుమానాస్పద సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలపాలని ఇవ్వాలని ఏసీపీ వసుంధర యాదవ్ సూచించారు.

## పొలిటికల్ షో!

(మొదటి పేజీ తరువాయి)



పాఠశాలల టెండర్లలో అవకతవకలపై బుధవారం అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతల మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్లు కొనసాగాయి. గురువారం నాటికి రాజకీయ ప్రదర్శనలుగా మారాయి. నిజాయితీగా ప్రజా సమస్యలపై, వాస్తవాలపై చర్చించేందుకు ఇరుపక్షాలు సిద్ధపడలేదని.. అంతా కేవలం పొలిటికల్ మైలేజ్ కోసమే నాటక మాడారు అనే విషయం కాజా పరిణామాలతో స్పష్టమైంది. చర్చకు సై అంటూ రెండు వర్గాలు చేసిన హడావుడి.. చివరకు ఎవరికి వారు తమ అనుకూల వేదికల వద్ద బలం నిరూపించుకునే ప్రయత్నం గానే ముగిసింది.

**పరస్పరం సవాళ్లు..**

తెలంగాణ రాష్ట్ర అప్పుల భారం, అవినీతిపై చర్చకు సిద్ధం అంటూ కేటీఆర్ తో పాటు హరీష్ రావు.. మరోవైపు తెలంగాణ భవన్లో కాంగ్రెస్ మంత్రులు.. గన్ పార్క్ వద్ద బహిరంగ చర్చకు రావాలని సవాళ్లు విసురుకున్నారు. జూపల్లి విస్రిన సవాల్ మేరకు గులాబీ పార్టీ నేతలు తాము చర్చకు సిద్ధమని ప్రకటించారు. గురువారం ఉదయం తెలంగాణ భవన్ కు చేరుకున్నారు. అటు కాంగ్రెస్ నేతలు, మంత్రులు అమరవీరుల స్తూపం వద్ద మోహరించారు. ఇరు వర్గాల శ్రేణులు భారీగా తరలి రావడంతో హైదరాబాదులోని తెలంగాణ భవన్, గన్ పార్క్ పరిసరాలు నిండిపోయాయి కార్యకర్తలతో. పోటా పోటీ నినాదాలు చేయడంతో ఉద్రిక్తత నెలకొంది.

**పోలీసుల అడ్డగింత..**

గులాబీ పార్టీ నేతలు హరీష్ రావు, శ్రీనివాస్ గౌడ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ లు తమ వద్ద ఉన్న డాక్యుమెంటరీ ఆధారాలతో గన్పార్క్ వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించారు. కానీ పోలీసులు తెలంగాణ భవన్ వెలుపలే వారిని అడ్డుకున్నారు. శాంతి భద్రతల సమస్య తలెత్తుతుందనే కారణంతో వారిని ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు. తాము కేవలం చర్చ కి వెళు తున్నామని.. ఫైటింగ్ కు కాదని హరీష్ రావు చెబుతున్న పోలీసులు వినలేదు. కాంగ్రెస్ మంత్రుల సవాల్ విసిరి.. ఇప్పుడు పోలీసులను అడ్డం పెట్టుకుని తమని రాకుండా అడ్డుకుంటున్నారని గులాబీ పార్టీ నేతలు ఆరోపణలు చేశారు. అయితే కాంగ్రెస్ నేతలు గన్ పార్క్ వద్ద కూర్చుని గులాబీ పార్టీ నేతలు రాలేదని విమర్శలు చేస్తుంటే.. బిఆర్ఎస్ నేతలు తాము వస్తుంటే పోలీసులతో అరెస్టు చేయించారని ఎదురుదాడికి దిగారు. అయితే ఇరు పార్టీలు పొలిటికల్ షోలకు దిగాయని చర్చ మాత్రం స్పష్టంగా అర్థం అవుతోంది.

## మావిగన్ మా రాజకీయ ఎజెండా

(మొదటి పేజీ తరువాయి)

చేసిన తాజా వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. మావిగన్ రాజధానిని తమ ఎజాండగా చేర్చామని, దీనితోనే ఎన్నికలకు వెళతామని ప్రకటించారు. దీనిని మేనిఫెస్టోలోనూ పెడతామని అన్నారు. ఇదో ఛాలెంజ్ అంటూ సవాల్ చేశారు. గత ఐదేళ్ల పాటు అమరావతిని కాదని, వికేంద్రీకరణెళి ధ్యేయంగా 'మూడు రాజధానుల' విశాఖపట్నం, అమరావతి, కర్నూలు నినాదంతో ముందుకు సాగి, అదే ఎజెండాతో ఎన్నికలకు వెళ్లిన ఆ పార్టీ ఓటమి తర్వాత తన వ్యూహాన్ని మార్చింది. ఇటీవల మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు ప్రాంతాల కలయికగా 'మావిగన్' సరికొత్త రాజధాని ప్రతిపాదనను జగన్ తెరపైకి తెచ్చారు. అయితే, నిన్నటి వరకు 'మావిగన్' నినాదంతోనే ముందుకు వెళ్తామని చెప్పిన జగన్, తాజాగా 'విజయవాడే ఆంధ్రప్రదేశ్ రాజధాని' అంటూ సంచలన ప్రకటన చేయడం రాజకీయ వర్గాలను విస్మయానికి గురిచేసింది. ఈ వరుస మార్పులతో అసలు రాజధాని విషయంలో వైసిపి అంతర్గత వ్యూహం ఏంటనే దానిపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది.

రాజధాని మార్పులపై అధినేత జగన్ ఒకదాని తర్వాత ఒకటిగా మారుస్తున్న ప్రకటనలతో సొంత పార్టీ నేతలు, శ్రేణులే తీవ్ర గందరగోళంలో పడ్డారు. దీనిపై వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ స్పందిస్తూ.. జగన్ పేర్కొన్న 'మావిగన్' లేదా విజయవాడ ప్రతిపాదనలు పార్టీ అధికారిక నిర్ణయం కాదని, ప్రస్తుత ప్రభుత్వానికి తాము ఇస్తున్న ఒక సూచన మాత్రమేనని సర్దుబాటు చేసే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ, మూడు రాజధానుల ముచ్చటను వదిలేసి, ఇప్పుడు కృష్ణా-గుంటూరు జిల్లాల వైపు జగన్ మొగ్గు చూపడం వెనుక భవిష్యత్తు రాజకీయ సమీకరణాలు దాగి ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. రాజధానిపై స్పష్టమైన ఏకాభిప్రాయం లేకపోవడం, రోజుకో మాట మారుస్తుండటంతో అధికార పక్షం కూటమి నేతలు వైసీపీ వైఖరిని తీవ్రంగా తప్పుబడుతున్నారు.

# మరో 200 కోట్ల అవినీతి అధికారి!

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రాల్లోని ఆయనకు సంబంధించిన 12 ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేసింది. ఇప్పటివరకు బయటపడిన ఆస్తుల విలువ మార్కెట్ ధరల ప్రకారం అక్షరాల వందల కోట్ల రూపాయలకు పైగా ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.

**ఏసీబీ దూకుడు..**

ఇటీవల ఏసీబీ దూకుడు పెంచింది. అవినీతి అధికారుల భరతం పడుతోంది. అయితే తాజాగా చేపట్టిన తనిఖీల్లో విస్తు పోయే నిజాలు బయటకు వస్తున్నాయి. డాక్యుమెంట్లు చూసి స్వయంగా అధికారులు విస్తు పోతున్నారు. మణికొండలోని పుప్పాలగూడ లో ఉన్న ఒక లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీ లోనే మూడు ఖరీదైన ప్లాట్లను అధికారులు గుర్తించారు. ఒక్కో ఇల్లు ఎనిమిది కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. కర్ణాటకలోనూ ఆయన భారీగా భూములు కొనుగోలు చేసినట్లు పత్రాలు లభ్యమయ్యాయి. బెంగళూరు నగర పరిధిలో ఒక ఎకరా భూమి, మరో ప్రాంతంలో మూడు ఎకరాల భూమితో పాటు సంగారెడ్డి



జిల్లా జహీరాబాద్ పరిసరాల్లో ఆరు ఎకరాల వ్యవసాయ భూములకు సంబంధించిన ఒరిజినల్ రిజిస్ట్రేషన్ పత్రాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

**విదేశీ మద్యం బాటిళ్లు..**

అయితే కేవలం ఆస్తులు మాత్రమే కాదు భారీగా లగ్జరీ వస్తువులు, కరెన్సీ సైతం పట్టుబడినట్లు తెలుస్తోంది.. తనిఖీల్లో ఆయన ఇంట్లో కుప్పలుగా పడి ఉన్న భారీ బంగారు ఆభరణాలను, వెండి వస్తువులను ఏసీబీ సీజ్ చేసింది. అంతేకాదు ఆయన ఇంట్లో భారీ ఎత్తున విదేశీ మద్యం సీసాలను చూసి అధికారులు షాక్ తిన్నారు. ఒక బాధ్యతాయుతమైన అధికారి ఇంట్లో ఇంత పెద్ద మొత్తంలో మద్యం బాటిల్ దొరకడం కలకలం రేపుతోంది. దీనిపై ఎక్సైజ్ శాఖ కూడా సమాచారం అందినట్లు తెలుస్తోంది. ప్రధానంగా డీఎస్పీ భీమ్ రెడ్డి పటాన్ చెరు పరిధిలో పనిచేసిన కాలంలో భారీ అక్రమార్జనకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. స్థానిక ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డితో చేతులు కలిపి భూ వివాదాలు, పారిశ్రామిక సెటిల్మెంటులు, సివిల్ పంచాయితీల్లో జోక్యం చేసుకొని పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడినట్లు ఏసీబీ ఇంటలిజెన్స్ నివేదికలో తేలింది. రాజకీయ అండదండలతో సాగించిన ఈ ల్యాండ్ సెటిల్మెంట్ల వల్లే ఆయన తక్కువ కాలంలో వందల కోట్ల సామ్రాజ్యాన్ని సృష్టించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇంకా తనిఖీలు కొనసాగుతున్నాయి.

# మూసీ సుందరీకరణ ప్రాజెక్టు మొదటి దశకు ఆమోదం

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు మొదటి దశకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ.7,345కోట్లతో మొదటి దశ పనులు చేపట్టనున్నారు. టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో 6,278 పోస్టుల మంజూరుకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన తెలంగాణ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. రాష్ట్రంలో వీబీ జీరామ్‌జీ పథకాన్ని అమలు చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. దీనికి సంబంధించిన అభ్యంతరాలపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని నిర్ణయం తీసుకుంది.కేబినేట్ వివరాలను మంత్రులు పొంగులేటి , సీతక్కలు వివరించారు. ఉపాధి హామీ పథకాన్ని ప్రజల అభిప్రాయాలకు విరుద్ధంగా తొలగించారని మండిపడ్డారు. దీని స్థానంలో విబిజిరామ్ పథకం తేవడం దుర్మార్గమని అన్నారు. విధిలేని పరిస్థితిలో దీనిని ఆమోదిస్తూనే, దీనిపై న్యాయపోరాటం చేయాలని కేబినెట్ నిర్ణయించిందని మంత్రి పొంగులేటి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను సంప్రదించకుండా ఏకపక్షంగా అమల్లోకి తెచ్చిన 'వీబీ జీ రామ్ జీ' చట్టంపై రాష్ట్ర మంత్రివర్గం తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఈ కొత్త చట్టం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడుతుందని, ఇది ఫెడరల్ , రాజ్యాంగ



స్ఫూర్తికి విరుద్ధమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలోని కేబినెట్ సబ్ కమిటీ చేసిన సిఫారసులపై చర్చించారు. ఉపాధి హామీ పథకంలో ఎలాంటి మార్పులు చేయవద్దని గత జనవరిలోనే అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, మరోసారి కేంద్రానికి నిరసన తెలపాలని నిర్ణయించారు. అయితే, ఇతర రాష్ట్రాలన్నీ దీనికి ఆమోదం తెలపడం, ఉపాధి హామీ కూలీలకు పని కల్పించాలనే ఉద్దేశంతో గత్యంతరం లేని పరిస్థితిలో ఈ చట్టాన్ని జులై 1 నుంచి రాష్ట్రంలో అమలు చేసేందుకు నోటిఫికేషన్ జారీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. కానీ, ఈ నిబంధనలపై సుప్రంకోర్టులో న్యాయపోరాటం చేయాలని, పార్లమెంట్‌లోనూ కేంద్రాన్ని నిలదీయాలని మంత్రివర్గం నిర్ణయించింది.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు అందించే అల్పాహారం, పాలు , మధ్యాహ్న భోజనాన్ని ఇకపై వారితో పాటు ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఇతర సిబ్బందికి కూడా అందించాలని కేబినెట్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. పిల్లలకు నాణ్యమైన పోషకాహారం అందించే సంకల్పంతో పాటు, భోజన వితరణలో జవాబుదారీతనం పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల రాష్ట్రంలో దాదాపు లక్షన్నర మంది ఉపాధ్యాయులు, లెక్చరర్లు, పాఠశాల సిబ్బందికి ప్రయోజనం చేకూరనుంది.కొత్తగా అందుబాటులోకి వస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో భారీ ఎత్తున నియామకాలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. సనత్ నగర్, ఎల్.బి.నగర్, అల్వాల్ టిమ్స్ ఆసుపత్రులతో పాటు వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలుగా మొత్తం 6,278 డాక్టర్లు, వైద్య సిబ్బంది పోస్టుల మంజూరుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో 1,494 రెగ్యులర్ పోస్టులు, 549 కాంట్రాక్ట్ పోస్టులు, 4,235 ఔట్ సోర్సింగ్ పోస్టులు ఉన్నాయి. ఈ ఆసుపత్రులను నిమ్స్ తరహాలో అభివృద్ధి చేయాలని, ఇక్కడ అందించే వైద్య సేవలకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి నిధులు కూడా ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

# 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యం

రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌ను నిర్వహిస్తోంది. 'స్వర్ణాంధ్ర 2047 ఎకనమిక్ ఇంటెలిజెన్స్ ఫర్ గవర్నెన్స్' అనే అంశంపై జరుగుతున్న ఈ సదస్సులో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొని పలు కీలక సూచనలు చేశారుఈ వర్క్‌షాప్‌లో ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి సభ్యుడు ప్రొఫెసర్ ఎస్. మహేంద్ర దేవ్, భారత ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్, కేంద్ర గణాంకాలు మరియు కార్యక్రమాల అమలు శాఖ కార్యదర్శి సౌరభ్ గార్గ్, నీతి ఆయోగ్ సభ్యులు బాలసుబ్రహ్మణ్యం, ప్రొఫెసర్ కె.వి. రాజు తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఆర్థికాభివృద్ధి, పాలన, డేటా ఆధారిత నిర్ణయాలు వంటి అంశాలపై వారు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. స్వర్ణాంధ్ర 2047 విజన్‌ను విజయవంతంగా అమలు చేయడంలో ప్రభుత్వ అధికారులను సన్నద్ధం చేయడం ఈ వర్క్‌షాప్ ప్రధాన లక్ష్యం. ప్రణాళికల రూపకల్పన నుంచి వాటి అమలు వరకు అనుసరించాల్సిన వ్యూహాలపై అధికారులకు అవగాహన కల్పించనున్నారు. భవిష్యత్ అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడంలో డేటా, సాంకేతికత పాత్రపై ప్రత్యేక చర్చలు నిర్వహిస్తున్నారు. ప్యానల్ చర్చల్లో పాల్గొన్న నిపుణులు ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న పలు కార్యక్రమాలను అభినందిం చారు. ముఖ్యంగా నియోజకవర్గాల వారీగా రూపొందిస్తున్న విజన్ ప్లాన్, పి4 కార్యక్రమం, గ్రామ స్థాయి డేటా సేకరణ, పాలనలో కృత్రిమ మేధ వినియోగం వంటి అంశాలను ప్రశంసించారు. ఇలాంటి కార్యక్రమాలు దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కనిపించడం లేదని, వీటిని జాతీయ స్థాయిలో అమలు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సాంకేతికతను పాలనలో విస్తృతంగా వినియోగిస్తున్నామని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. ఐటీ నుంచి ఏఐ వరకు ప్రతి ఆధునిక సాంకేతికతను రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగిస్తు న్నామని చెప్పారు. హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ కేంద్రాన్ని తీసుకురావడానికి తాము అమెరికా వరకు వెళ్లి కృషి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే ఆధార్‌ను దేశంలో ఒక గేమ్ చేంజర్‌గా అభివర్ణిస్తూ, ప్రతి ప్రభుత్వ పథకాన్ని ఆధార్‌తో అనుసంధానం చేయడం వల్ల డూప్లికేషన్‌లను నివారించడం సాధ్యమైందన్నారు. ప్రస్తుతం ప్రపంచం డేటా ఆధారిత ఆర్థిక వ్యవస్థ వైపు వేగంగా అడుగులు వేస్తోందని చంద్రబాబు అన్నారు. 'డేటానే సంపదగా మారిన ఈ యుగంలో డేటా ఆధారిత నిర్ణయాలే భవిష్యత్తును నిర్దేశిస్తాయి' అని అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే కాకుండా రాష్ట్రంలో సంపద సృష్టికి ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడం కూడా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. స్వర్ణాంధ్ర విజన్‌లో పెట్టుబడుల ప్రాధాన్యాన్ని ప్రత్యేకంగా చేర్చినట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని శాఖల డేటాను ఒకే వేదికపైకి తీసుకువచ్చే లక్ష్యంతో 'డేటా లేక్' ఏర్పాటు చేస్తున్నామని సీఎం అన్నారు. అలాగే ప్రజల ఆరోగ్య రికార్డులను పూర్తిగా డిజిటలైజ్ చేసి 'సంజీవని' ప్రాజెక్టును అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ సేవలు మరింత పారదర్శకంగా, వేగవంతంగా ప్రజలకు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. పేదలు, ధనికుల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేందుకు పి4 కార్యక్రమాన్ని రూపొందించామని సీఎం చంద్రబాబు గుర్తుచేశారు. ప్రతి కుటుంబ జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, ఉమ్మడి కుటుంబ వ్యవస్థను ప్రోత్సహించడం, సమగ్ర అభివృద్ధిని సాధించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని చెప్పారు.

## నాగరాజుకు 8 రోజుల పోలీస్ కస్టడీ

### అనుమతించిన విజయవాడ కోర్టు

విజయవాడ: ఏపీలో సంచలనం సృష్టించిన విజయవాడ యువకుడు గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సీఐ ఎస్.ఎస్.వి.వి. నాగరాజును 8 రోజుల పోలీస్ కస్టడీకి కోర్టు అనుమతించింది. నాగరాజును తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ ప్రత్యేక దర్యాప్తు బృందం పోలీసులు విజయవాడ కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. సీఐ నాగరాజు పోలీస్ కస్టడీపై న్యాయస్థానం గురువారం తుది తీర్పును వెలువరించింది. సిట్ అధికారులు 12 రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని కోరగా.. 8 రోజుల కస్టడీకి కోర్టు అనుమతించింది. విచారణను వీడియో, ఆడియో రికార్డు చేసి సమర్పించాలని న్యాయాధికారి ఆదేశించారు. ఉదయం 10 గంటల నుంచి 5 గంటల వరకు మాత్రమే విచారించాలని సూచించారు. సీఐ నాగరాజు ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్నారు. సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో రేపటి నుంచి సీఐ నాగరాజు విచారణ ప్రారంభం కానుంది.

## హఠాత్తుగా రోడ్డుపై పడిపోయిన వ్యక్తి

### సిపిఆర్ చేసి కాపాడిన ఇద్దరు నర్సులు

తిరువనంతపురం: రోడ్డుపై హఠాత్తుగా గుండె పోటు బారిన పడ్డ ఒక వ్యక్తిని ఇద్దరు నర్సులు సీపీఆర్ చేసిన కాపాడారు. ఆ వ్యక్తి ఆపదలో ఉన్న విషయాన్ని గుర్తించిన వెంటనే రన్నింగ్ బస్సులోంచి దూకి మరీ సాయం అందించారు. కేరళలోని ఎర్నాకుళం జిల్లాలో ఈ ఘటన వెలుగు చూసింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం, సినోజ్ అనే వ్యక్తి ఒక్కల్ ప్రాంతంలో లాటరీ షాపు నిర్వహిస్తుంటారు. కారులో వెళుతుండగా ఛాతిలో నొప్పి రావడంతో కారును పక్కన నిలిపి క్షణాల్లో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. అదే రోడ్డుపై బస్సులో వెళుతున్న నర్సు అంజలి బైజు, నర్సింగ్ స్టూడెంట్ ఆర్ద సినోజ్ ఆపదలో ఉన్న విషయాన్ని గమనించారు. ఆలస్యం చేయకుండా రన్నింగ్ బస్సులోంచి దిగిపోయి సినోజ్‌కు సీపీఆర్ చేశారు.

## తెలంగాణ జర్నలిస్ట్ కెవిఆర్‌కు 14 రోజుల రిమాండ్

### బాబు, పవన్‌లపై అనుచిత వ్యాఖ్యల కేసులో అరెస్ట్

విజయనగరం,జూలై2: తెలంగాణకు చెందిన జర్నలిస్ట్ కె.వెంకటరామిరెడ్డి (కేవీఆర్)ని బాడంగి పోలీసులు విజయనగరం జిల్లా బొబ్బిలి కోర్టులో హాజరు పరిచారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో ఆయన్ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఈనెల 14 వరకు రిమాండ్ విధించారు. దీంతో కేవీఆర్‌ను బొబ్బిలి జైలుకు తరలించారు. విజయనగరం జిల్లా బాడంగి మాజీ సర్పంచ్ కండి రమేశ్ ఫిర్యాదు మేరకు కేవీఆర్‌ని హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో బాడంగి పోలీసులు మంగళవారం రాత్రి అరెస్టు చేశారు. భారత రాజ్యాంగం, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌లపై అనుచిత, అసభ్యకర వ్యాఖ్యలు చేశారని రమేశ్ ఏప్రిల్ 10న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేవీఆర్‌ను బొబ్బిలి పోలీస్‌స్టేషన్‌కు బుధవారం తీసుకొచ్చారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యపరీక్షలు నిర్వహించారు. విచారణకు హాజరు కావాలని బాడంగి పోలీసులు నోటీసులు జారీ చేసినా పట్టించుకోకపోవడంతో బొబ్బిలి గ్రామీణ సీఐ శ్రీనివాస్‌తో కూడిన బృందం కేవీఆర్ ఇంటికే వెళ్లి అరెస్టు చేసింది.

## తెలంగాణ వ్యవసాయంపై ఇండోనేషియా ఆసక్తి

### వ్యవసాయ సంచాలకునితో బృందం భేటీ

### పలు పంటల విధానంపై వివరించిన డా. గోపి

హైదరాబాద్,జూలై2: ఇండోనేషియా ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం తెలంగాణ వ్యవసాయ సంచాలకుల కార్యాలయాన్ని సందర్శించింది ఆహార భద్రత, వ్యవసాయ స్వయం సమృద్ధి, సుస్థిర వ్యవసాయ అభివృద్ధిపై అధ్యయనం చేసేందుకు భారత పర్యటనలో భాగంగా ఇండోనేషియా దేశానికి చెందిన నలుగురు సభ్యులతో కూడిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ వ్యవసాయ సంచాలకుల కార్యాలయాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా ప్రతినిధి బృందం తెలంగాణ వ్యవసాయ శాఖ డైరెక్టర్ డా. బి. గోపీని మర్యాదపూర్వకంగా కలిసింది. సమావేశంలో తెలంగాణ వ్యవసాయరంగం పురోగతి, రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, వ్యవసాయంలో అమలు చేస్తున్న ఆధునిక సాంకేతిక విధానాలపై వ్యవసాయ శాఖ అధికారులు సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాఖ అధికారులు ఆయిల్ పామ్ సాగు అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. తెలంగాణ రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ అధికారులు రైతులకు నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి, పంపిణీపై వివరించగా, తెలంగాణ రాష్ట్ర విత్తన ధృవీకరణ సంస్థ అధికారులు విత్తన ధృవీకరణ, నాణ్యత నియంత్రణ ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను ప్రతినిధి బృందానికి వివరించారు. రాష్ట్రంలో అమలవుతున్న రైతు భరోసా, రైతు బీమా, ప్రకృతి వ్యవసాయం, నేల ఆరోగ్య నిర్వహణ, వ్యవసాయ యాంత్రీకరణ, వ్యవసాయ డ్రోన్ల వినియోగం, జాతీయ ఆహార భద్రతా మిషన్, పప్పుధాన్యాల అభివృద్ధి కార్యక్రమం, నూనెగింజల ఉత్పత్తి ప్రోత్సాహక పథకం, డిజిటల్ క్రాప్ సర్వే, అగ్రి స్టాక్ (ఫార్మర్ రిజిస్ట్రీ), యూరియా బుకింగ్ యాప్, ఆన్‌లైన్ లైసెన్స్ మేనేజ్మెంట్ సిస్టమ్, రైతు వేదికలు, రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ వంటి వినూత్న కార్యక్రమాల అమలు, వాటి ప్రయోజనాలను అధికారులు వివరించారు. తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ రంగంలో అమలు చేస్తున్న రైతు కేంద్రిత, పారదర్శక, సాంకేతిక ఆధారిత కార్యక్రమాలను ఇండోనేషియా ప్రతినిధి బృందం అభినందించింది. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్నటువంటి రైతు భరోసా రైతు బీమా యూరియా యాప్ సహజ వ్యవసాయం వంటి పథకాలపై ప్రశంసించారు ఈ సందర్భంగా వ్యవసాయ పరిశోధన, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, ఆహార భద్రత, రైతుల సామర్థ్యాభివృద్ధి, సుస్థిర వ్యవసాయ అభివృద్ధి అంశాలపై ఇరు పక్షాలు విస్తృతంగా చర్చించాయి.

## యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డు విషయంలో కినుక

### కేబినేట్ భేటీకి కొండా సురేఖ గైర్హాజర్

హైదరాబాద్,జులై 2(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్ర కేబినెట్ సమావేశానికి రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గైర్హాజరు కావడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి అధ్యక్షతన గురువారం జరిగిన మంత్రిమండలి సమావేశానికి ఆమె రాకపోవడంపై సచివాలయ వర్గాలతో పాటు రాజకీయంగానూ పలు ఊహాగానాలు వ్యక్తమవుతు న్నాయి. సురేఖ తన విదేశీ పర్యటన ముగించుకుని రాష్ట్రానికి తిరిగి వచ్చినప్పటికీ, గురువారం జరిగిన కేబినెట్ భేటీకి రాకపోవడం వెనుక బలమైన కారణాలే ఉండి ఉంటాయని అంతా భావిస్తున్నారు.ప్రధానంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ బోర్డు ఏర్పాటు పక్రియకు సంబంధించిన వ్యవహారమే మంత్రి కొండా సురేఖ అసంతృప్తికి కారణమనే ప్రచారం జోరుగా సాగుతోంది. తన శాఖకు సంబంధించిన అత్యంత కీలకమైన ఈ బోర్డు ఏర్పాటు విషయంలో దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న తన అభిప్రాయాలను పూర్తిగా పరిగణనలోకి తీసుకోలేదనే భావనతో ఆమె ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో తీవ్ర అలక పూనిన కారణంగానే కొండా సురేఖ ఉద్దేశపూర్వకంగానే ఇవాల్టి కేబినెట్ సమావేశానికి దూరంగా ఉన్నారని సచివాలయ వర్గాల్లో గట్టిగా చర్చ నడుస్తోంది.




క్రైమ్ మిర్రర్

ఎడిటోరియల్

4

శుక్రవారం

3-7-2026



**తె**లంగాణ రాష్ట్ర రాజకీయాల్లో సవాళ్లు ప్రతిసవాళ్లతో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అధికార పార్టీని ఎండగట్టడమే పనిగా బిఆర్ఎస్ పనిచేస్తోంది. విపక్ష బిఆర్ఎస్ లక్ష్యంగా ఈ మధ్య సిఎం రేవంత్ కూడా ఘాటుగానే దాడి చేస్తున్నారు. ఎపిలో కూడా దాదాపు ఇదే తరహా రాజకీయాలు నడుస్తున్నాయి. జగన్ పార్టీని గొడ్డలి పార్టీ అంటూ అధికార టిడిపి దుమ్మెత్తి పోస్తోంది. జగన్ కూడా ఎపిలో చట్టాలకు విలువ లేకుండా పోయిందని అంటున్నారు. మొత్తంగా అభివృద్ధి, ప్రజల అవసరాలు పక్కకు పోయాయి. సవాళ్లు, ప్రతిసవాళ్లు నడుస్తున్నాయి. తమ రాజకీయం కోసం రాష్ట్ర అభివృద్ధిని, పాలనను పక్కన పెట్టారు. ఇకపోతే తెలంగాణలో అంతకుమించి అన్నట్లుగా సవాళ్లు, ప్రతిసవాళ్లతో రాజకీయాలు వేడెక్కాయి. ఇప్పుడే ఎన్నికలు లేవు. మరో రెండేళ్ల సమయం ఉంది. అయినా అప్పుడే ఎన్నికల వేడి పుట్టించేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీది రెండున్నరేండ్ల చెత్త పాలన అంటూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,హరీష్ రావులు విమర్శలు గుప్పిస్తున్నారు. బిఆర్ఎస్ అప్పులు చేసి, రాష్ట్రాన్ని ఆగం చేసిందని సిఎం రేవంత్ సహా మంత్రులు అడపాదడపా విమర్శలు గుప్పిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి, అక్రమాల పై లెక్కలతో పక్కాగా వివరిస్తామని ప్రతిగా బిఆర్ఎస్ నేతలు సవాళ్లు విసరుతున్నారు. అసెంబ్లీ లేకపోతే వేదిక ఏదైనా బీఆర్ఎస్ తరఫున తాను చర్చకు వస్తా.. రాహుల్‌గాంధీ వస్తారో? ఇంకెవరొస్తారో తేల్చుకోండి. మీ పాలనావైఫల్యాలను లెక్కలతో బయటపెట్టకపోతే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకొంటానని కెటిఆర్ చాలెంజ్ చేశారు.కాగా,కేటీఆర్ సవాల్‌కు మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. తాను తెలంగాణ భవన్‌కు వస్తానని మంత్రి ప్రతి సవాల్ విసిరారు. మంత్రి చాలెంజ్‌ను స్వీకరించిన బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ భవన్‌లో మీ కోసం ప్రత్యేకంగా కుర్చీ రెడీగా ఉంది. మీదే ఆలస్యం దమ్ముంటే చర్చకు రావాలన్నారు. దీంతో ఒక్కసారిగా రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. అటు తెలంగాణ భవన్, ఇటు గాంధీ భవన్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జూపల్లి వ్యాఖ్యల నేపథ్యంలో కేటీఆర్, హరీశ్ రావు బీఆర్ఎస్ భవన్‌కు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. జూపల్లి వస్తే కేంద్ర ప్రభుత్వ నివేదికలు, ఆర్‌బీఐ లెక్కలు, సాక్ష్యాలతో సహా వివరిస్తామని వారు తెలిపారు. కాగా, జూపల్లితో చర్చకు కేటీఆర్ అవసరం లేదని తాను సరిపోతానని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కావాలంటే కేటీఆర్ కూడా వస్తారన్నారు. ఇలా రోజుకో సవాల్,

# తెలంగాణలో సవాళ్ల రాజకీయాలు!

ప్రతి సవాల్‌లో రాజకీయాలు నడుస్తున్నాయి. ఏ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు. ఎన్ని నెరవేర్చారో చర్చకు బరాబర్ సిద్ధమేనన్నారు. కాంగ్రెస్ అప్పుల బాగోతాన్ని లెక్కలతో తిప్పికొడుతామన్నారు. సవాళ్లు, ప్రతి సవాళ్ల నేపథ్యంలో తెలంగాణలో రాజకీయాలు హాట్‌హాట్‌గా సాగుతున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి కూడా ప్రత్యర్థులకు చెక్ పెట్టేందుకు అడపాదడపా బిజెపి, బిఆర్ఎస్‌లను లక్ష్యంగా నేరుగా విమర్శలు చేస్తున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండున్నరేళ్ళ సమయం ఉన్నా, అప్పుడే ఎలక్షన్ మూడ్ వచ్చేస్తున్నట్టు కనిపిస్తోంది. అన్ని రాజకీయ పార్టీలు అదే తరహా ప్లానింగ్‌లో ఉన్నాయి. అందునా అధికారంలో ఉన్నాం కాబట్టి ఎక్కడా తగ్గకూడదన్న ఉద్దేశ్యం కాంగ్రెస్ పార్టీలో, ప్రత్యేకించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలో కనిపిస్తోంది. రాష్ట్రంలో రెండోసారి అధికారం చేపట్టేందుకు అవసరమైన ఎత్తుగడలకు ఆయన పదును పెడుతున్నట్టు కనిపిస్తోంది. ఎందుకంటే మళ్లీ కాంగ్రెస్ సర్కార్ వస్తుందని, తానే సిఎంనని పదేపదే ప్రకటిస్తున్నారు. ఇదంతాఓక ఎత్తయితే విపక్ష బిఆర్ఎస్, బిజెపిలను దెబ్బకొట్టడంతో పాటు, బలంగా లేని చోట కాంగ్రెస్‌ను బలోపతేం చేసే పనిలో పడ్డారని తెలుస్తోంది. ముఖ్యంగా పార్టీ ఎక్కడైతే బలంగా లేదో అక్కడి నుంచే కార్యాచరణ మొదలు పెట్టాలని రేవంత్ రెడ్డి పని చేస్తున్నారు. ఆ రెండు పార్టీలకు చెక్ పెట్టడానికి అక్కడి నుంచే యుద్ధం ప్రారంభించాలని సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో దీనికి సంబంధించిన చర్చలు గట్టిగానే నడుస్తున్నాయి. వచ్చే డిసెంబర్ నుంచి తన పొలిటికల్ స్కెచ్‌ని అమలు చేసే పనిలో ముఖ్యమంత్రి ఉన్నట్టు తెలుస్తోంది. అందుకు ఇప్పటినుంచి గ్రౌండ్ వర్క్ మొదలు పెట్టినట్టు సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్‌ని రెండోసారి అధికారంలోకి తీసుకొస్తానని ఇప్పటికే చేసిన ప్రకటనకు అనుగుణంగా పొలిటికల్ గ్రౌండ్ ప్రిపేర్ చేసుకునే పనిలో ఉన్నారన్నది పొలిటికల్ టాక్. డిసెంబర్ తర్వాత పూర్తిగా గ్రౌండ్‌లోనే ఉండాలని రేవంత్ డిసైడ్ అయినట్టు కనపడు తోంది. అందుకోసం ప్రధానంగా ఉత్తర తెలంగాణ మీద ఫోకస్ పెట్టబోతున్నారట. దక్షిణ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి గట్టి పట్టుంది. గత ఎన్నికల్లో ఆ విషయం నిరూపితమైంది కూడా. కానీ, ఉత్తర తెలంగాణలో బీజేపీ బలపడుతున్నందున ఇక అక్కడ ఫోకస్ చేయాలన్నది సీఎం ప్లాన్‌గా తెలుస్తోంది. ఉత్తర తెలంగాణ నుండి తన రాజకీయ వ్యూహాన్ని అమలు చేసే పనిలో భాగంగా బస్సు యాత్ర లేదంటే పాదయాత్ర చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. ప్రభుత్వ పథకాల అమలు, రాజకీయ ఎత్తుగడల్ని అక్కడి నుంచే అమలు చేయాలని భావిస్తున్నారని సమాచారం. వచ్చే ఎన్నికల నాటికి బీఆర్ఎస్, బీజేపీల కట్టడిని అక్కడి నుంచే మొదలుపెట్టాలనుకుంటున్నట్లు అర్థం అవుతోంది. . ఓట్ బ్యాంకును పెంచుకోవడంతో పాటు,తన రెండున్నరేళ్ళ పాలన, గత బీఆర్ఎస్ పాలనపై చర్చకు పెట్టడంతో పాటు కేంద్రంలోని బీజేపీ తీరు, రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం గురించి కూడా ప్రజలు మాట్లాడుకునేలా చేయాలనుకుంటున్నట్టు తెలుస్తోంది. గత ఎన్నికలకు ముందు పాదయాత్ర నిర్వహించారు రేవంత్‌రెడ్డి. అది ఎలా ఉన్నా విపక్ష పార్టీలకు చెక్ పెట్టే లక్ష్యంతో ఏకంగా రెండు పార్టీలపై దాడిని ముమ్మరం చేశారు. దీంతో తెలంగాణలో రాజకీయం వేడెక్కింది. .

**ఇల్లు లేనివాడు అసంపూర్ణుడు అని మన సమాజం చిన్నప్పటి నుంచి నూరిపోస్తుంది. తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు అందరూ ఒకే మాట చెబుతారు.సొంతిల్లు కట్టుకో, అప్పుడే జీవితం సెటిల్ అయినట్టు. కానీ నిజంగా ఇల్లు కొనడం అంటే జీవితంలో స్థిరత్వమా, లేక 20-25 సంవత్సరాల ఈఎంఐ అనే బంధనమా? ఈ ప్రశ్న ఈనాటి యువతను, మధ్యతరగతి కుటుంబాలను తీవ్రంగా వేధిస్తోంది. ఒకవైపు సొంత గూడు అనే కల, మరోవైపు స్వేచ్ఛగా బతకాలనే ఆకాంక్ష మధ్య నేటి తరం నలిగిపోతోంది. ఈ ఆధునిక జీవనశైలి సందిగ్ధతపై ఒక లోతైన విశ్లేషణ.**

# సొంతిల్లు ఒక కల... మరి స్వేచ్ఛగా బతకడం ఒక విలాసమా?



ఒక ఉదాహరణ చూద్దాం. విజయవాడలో 60 లక్షల రూపాయల విలువైన ఫ్లాట్‌ను 20 ఏళ్ల గృహ రుణంపై కొనుక్కుంటే, వడ్డీ రేటును బట్టి మొత్తం చెల్లించే మొత్తం దాదాపు 1.1 కోట్ల నుంచి 1.2 కోట్ల వరకూ చేరుకుంటుంది. అంటే అసలు ధర కంటే దాదాపు రెట్టింపు మొత్తం వడ్డీ రూపంలో బ్యాంకుకు కట్టాల్సి వస్తుంది. ఈ 20 ఏళ్లలో ఉద్యోగం మారాలన్నా, సొంత వ్యాపారం పెట్టుకోవాలన్నా, పిల్లల చదువుల కోసం విదేశాలకు వెళ్లాలన్నా ఈఎంఐ అనే బండ మెడకు వేలాడుతూనే ఉంటుంది. ప్రతి నెలా ఒకటో తేదీ రాగానే జీతం నుంచి సింహభాగం బ్యాంకు ఖాతాలోకి వెళ్ళిపోతుంటే, చేతిలో మిగిలిన చిల్లరతో జీవితాన్ని నెట్టుకురావడం ఒక రకమైన ఆధునిక బానిసత్వమే అవుతుంది.అమెరికాలోని కార్నెల్ విశ్వవిద్యాలయ మనస్తత్వ శాస్త్రవేత్త థామస్ గిలోవిచ్ దశాబ్దాలుగా చేసిన పరిశోధనలు ఒక ఆశర్యకరమైన విషయాన్ని వెల్లడించాయి. వస్తువులు కొనడం వల్ల కలిగే సంతోషం కాలక్రమేణా తగ్గిపోతుంది (దీన్ని 'హెడోనిక్ అడాప్టేషన్' అంటారు), కానీ ప్రయాణాలు, అనుభవాలు, కుటుంబంతో గడిపే క్షణాల వల్ల కలిగే సంతృప్తి కాలక్రమేణా తీపి జ్ఞాపకాలుగా మారి మరింత విలువైనదిగా మారుతుంది. ఇల్లు అనేది కూడా ఒక భౌతిక ఆస్తే అయినప్పటికీ, దాన్ని సొంతం చేసుకోవడం కోసం చేసే త్యాగాలు ప్రయాణాలు వాయిదా వేయడం, పిల్లలతో గడిపే సమయాన్ని తగ్గించుకోవడం, ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం ఈ పరిశోధన కోణం నుంచి చూస్తే ప్రశ్నార్థకమే. కాంక్రీట్ గోడల మధ్య బందీ అయి, జీవితంలో మళ్ళీ రాని వసంతాలను కోల్పోవడం ఎంతవరకు సమంజసం అనే ప్రశ్న ఇక్కడ ఉదయిస్తుంది.

ఇది పూర్తిగా తప్పు అని చెప్పలేం. స్థిరమైన ఆదాయం ఉన్నవారికి, ఒకే నగరంలో శాశ్వతంగా స్థిరపడాలనుకునేవారికి సొంతిల్లు నిజంగానే మానసిక భద్రత ఇస్తుంది. అద్దె పెరుగుదల భయం ఉండదు, ప్రతి ఏడూ ఇల్లు మారాలనే టెన్షన్ ఉండదు, ఇంటి యజమాని ఖాళీ చేయమని చెప్పే బాధ ఉండదు, పదవీ విరమణ తర్వాత నివాసం గురించి చింత ఉండదు. హైదరాబాద్‌లో గత పదేళ్లలో స్థిరాస్తి విలువలు గణనీయంగా పెరిగాయని రియల్ ఎస్టేట్ నివేదికలు చూపిస్తున్నాయి కాబట్టి సరైన ప్రాంతంలో, సరైన సమయంలో కొన్న ఇల్లు దీర్ఘకాలంలో సంపదను పెంచే అద్భుతమైన సాధనం కూడా కావచ్చు.కానీ ఇక్కడే అసలు సమస్య దాగుంది సరైన ప్రాంతం, సరైన సమయం, సరైన ఆర్థిక సామర్థ్యం అనే మూడు షరతులు ఒకేసారి కుదరడం అరుదు. చాలామంది కేవలం సామాజిక ఒత్తిడి వల్ల, అందరూ ఇల్లు కొంటున్నారు కదా, మనం వెనుకబడిపోతామేమో అనే ఫోమో( ఫియర్ అఫ్ మిస్సింగ్ అవుట్ ) ఆలోచనతో, తమ ఆర్థిక సామర్థ్యానికి మించిన భారీ రుణం తీసుకుని ఇల్లు కొంటున్నారు. ఫలితంగా జీతంలో 50-60 శాతం ఈఎంఐకే పోతుంది, మిగిలిన సొమ్ముతో కనీస అవసరాలు తీర్చుకోవడమే కష్టమవుతుంది. దాంతో జీవితంలో సంతోషం మృగ్యమై, కేవలం అప్పులు తీర్చే యంత్రాలుగా మారిపోతున్నారు.మరోవైపు, జీవితాన్ని ఆస్వాదించాలి అనే వాదన కూడా అపార్థం చేసుకోవడానికి వీలుంది. దీని అర్థం సంపాదనంతా విచ్చలవిడిగా పబ్బులు, క్లబ్బులు, విలాసవంతమైన వస్తువులపై ఖర్చు చేయడం కాదు. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేసే చాలామంది యువత ఇప్పుడు ఇల్లు కొనే బదులు అద్దె ఇంట్లో ఉంటూ, మిగిలిన సొమ్మును మ్యూచువల్ ఫండ్స్‌లో, స్టాక్ మార్కెట్‌లో క్రమబద్ధమైన పద్ధతిలో పెట్టుబడిగా పెడుతున్నారు. ఆర్థిక నిపుణుల విశ్లేషణ ప్రకారం, దీర్ఘకాలంలో క్రమశిక్షణతో చేసే ఈక్విటీ పెట్టుబడులు, స్థిరాస్తి కంటే మెరుగైన, వేగవంతమైన రాబడిని ఇచ్చే అవకాశం ఉంది అయితే స్థిరాస్తిలా కంటికి కనిపించే, స్పృశించగలిగే భద్రత భావన ఇందులో ఉండదు అనేది కూడా వాస్తవమే.అనుభవాలపై పెట్టే ఖర్చు కుటుంబంతో కలిసి ప్రపంచాన్ని చుట్టిరావడం, పిల్లలకు అంతర్జాతీయ స్థాయి నాణ్యమైన విద్యనందించడం, తల్లిదండ్రుల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం, స్వీయ నైపుణ్యాభివృద్ధి కోసం కోర్సులు చేయడం ఇవి కూడా ఒక రకమైన అదృశ్య పెట్టుబడులే. వీటిని ఈఎంఐ భారంతో పోల్చి వృథా ఖర్చులు అని కొట్టిపారేయడం ఎంతమాత్రం సరికాదు. డబ్బును కేవలం ఇటుకలు, సిమెంట్‌గా మార్చడం కంటే, జ్ఞాపకాలుగా మార్చుకోవడం కూడా ఒక అద్భుతమైన కళే.నిజానికి ఇది ఇల్లు వర్సెస్ జీవితం అనే రెండు ధ్రువాల ప్రశ్న కాదు ఇది ప్రాధాన్యతల ప్రశ్న, సమయానుకూల నిర్ణయం. మీ వయసు, ఆదాయ స్థిరత్వం, కుటుంబ బాధ్యతలు, భవిష్యత్ ప్రణాళికలను బట్టి ఈ నిర్ణయం మారుతుంది. 20ల చివర్లో, 30ల ఆరంభంలో ఉన్నవారికి కెరీర్ వృద్ధి, నైపుణ్యాభివృద్ధి, కొత్త అనుభవాలు ఎక్కువ విలువైనవి కావచ్చు. 35-40 దాటాక, స్థిరమైన ఆదాయ వనరులు ఏర్పడ్డాక, చేతిలో తగినంత డౌన్ పేమెంట్ సమకూరిన తర్వాత మాత్రమే ఇల్లు కొనడం ఆర్థికంగా సురక్షితమైన నిర్ణయం కావచ్చు.జీవితం అనేది ఒకేసారి వచ్చే ఒక అద్భుతమైన అవకాశం. మీరొకసారి ఆత్మావలోకనం చేసుకోండి. మీరు ఈఎంఐ కడుతున్న ప్రతి నెలా, నిజంగా మీరు ఒక ఇటుకల గోడను సొంతం చేసుకుంటున్నారా, లేక మీ యవ్వనపు అమూల్యమైన సంవత్సరాలను, జీవితంలో మళ్లీ రాని అమూల్యమైన క్షణాలను బ్యాంకుకు తాకట్టు పెడుతున్నారా ఈ ప్రశ్నకు మీ దగ్గర నిజాయితీగా సమాధానం ఉందా?



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# యూజర్‌నేమ్ ఫీచర్ ఇంకా అందుబాటులోకి తీసుకురాలేదు

**దశలవారీగా తీసుకొచ్చే ప్రయత్నంలో ఉన్నాం**

**యూజర్ నేమ్ ఉన్నా ఫోన్ నంబర్ తప్పనిసరి**

**కేంద్రం అభ్యంతరాలకు వాట్సాప్ సమాధానం**




వాట్సాప్‌లో ప్రవేశపెట్టబోతున్న యూజర్‌నేమ్ ఫీచర్‌పై కేంద్ర ప్రభుత్వం వ్యక్తం చేసిన ఆందోళనల నేపథ్యంలో మెటా సంస్థకు చెందిన వాట్సాప్ కీలక వివరణ ఇచ్చింది. ప్రస్తుతం యూజర్‌నేమ్ ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకురాలేదని, వినియోగదారులు తమకు నచ్చిన యూజర్ నేమ్‌ను ముందస్తుగా రిజర్వ్ చేసుకునే అవకాశం మాత్రమే కల్పించామని స్పష్టం చేసింది. ఈ ఫీచర్‌ను ఈ ఏడాది చివర్లో దశలవారీగా అమలు చేస్తామని వెల్లడించింది. యూజర్‌నేమ్ ఫీచర్‌తో వినియోగదారులు తమ మొబైల్ నంబర్‌ను వెల్లడించకుండా కొత్త వ్యక్తులు, గ్రూపులతో కనెక్ట్ అయ్యే అవకాశం ఉంటుందని తెలిపింది. ఈ ఫీచర్‌తో గోప్యత, భద్రత, నకిలీ ఖాతాలు, మోసాలు వంటి అంశాలపై వస్తున్న సందేహాలకు ఎక్స్ వేదికగా వివరణ ఇచ్చింది. యూజర్‌నేమ్‌ను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సృష్టించాల్సిన అవసరం లేదని వాట్సాప్ తెలిపింది. ఇది పూర్తిగా వారి ఇష్టమని పేర్కొంది. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లో ఇప్పటికే ఉన్న యూజర్‌నేమ్‌లు ఆయా ఖాతాదారుల కోసం రిజర్వ్ చేయబడతాయని వాట్సాప్ తెలిపింది. అలాగే ప్రముఖులు, ప్రభుత్వ సంస్థలు, సెలబ్రిటీలు, మెటా వెరిఫైడ్ ఖాతాలకు సంబంధించిన పేర్లు, వాటి వేరియేషన్లు కూడా దుర్వినియోగానికి గురి కాకుండా రక్షిస్తామని పేర్కొంది. ఒకవేళ సాధారణ పేరు ఇప్పటికే మరొకరు తీసుకున్నట్లయితే, ప్రత్యామ్నాయ యూజర్‌నేమ్‌లను సూచించే జనరేటర్‌ను ఉపయోగించుకోవచ్చని తెలిపింది. తన యూజర్‌నేమ్‌కు దగ్గరగా మరో వ్యక్తి పేరు సృష్టించి మోసాలకు పాల్పడితే ఎలా అనే ప్రశ్నకు వాట్సాప్ స్పందించింది. యూజర్‌నేమ్‌లను సెర్చ్ చేసే అవకాశం ఉండదని స్పష్టం చేసింది. యూజర్‌నేమ్ ఆధారంగా సందేశాలు పంపే ఫీచర్ అందుబాటులోకి వచ్చిన తర్వాత, కొత్త వ్యక్తి నుంచి మెసేజ్ వస్తే అతని దేశం, ఖాతా వివరాలు, భద్రతా హెచ్చరికలు చూపిస్తామని తెలిపింది. ఇప్పటికే ఉన్న బ్లాక్, రిపోర్ట్ వంటి భద్రతా చర్యలు యథావిధిగా కొనసాగుతాయని పేర్కొంది.

యూజర్‌నేమ్‌తో పాటు 'యూజర్‌నేమ్ కీ' అనే అదనపు భద్రతా వ్యవస్థను కూడా ప్రవేశపెడుతున్నట్లు వాట్సాప్ వెల్లడించింది. దీన్ని యాక్టివేట్ చేసుకుంటే, అవతలి వ్యక్తికి యూజర్‌నేమ్‌తో పాటు కీ కూడా తెలిసి ఉండాల్సి ఉంటుంది. అవసరమైతే ఈ కీని ఎప్పుడైనా మార్చుకునే అవకాశం ఉంటుందని తెలిపింది. ఫేస్‌బుక్ లేదా ఇన్‌స్టాగ్రామ్‌లో ఉన్న అదే యూజర్‌నేమ్‌ను వాట్సాప్‌లో కూడా ఉపయోగించాల నుకునే వారు ముందుగా ఆ ఖాతాలను లింక్ చేసి యాజమాన్యాన్ని నిర్ధారించుకోవాల్సి ఉంటుందని తెలిపింది. అనంతరం కావాలంటే ఆ ఖాతాలను అన్‌లింక్ చేసుకునే అవకాశం కూడా ఉంటుందని వెల్లడించింది. యూజర్‌నేమ్ ఫీచర్ అమలుతో నకిలీ గుర్తింపులు, డిజిటల్ అరెస్ట్ మోసాలు, ఆర్థిక మోసాలు పెరిగే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వ అధికారులు, ఆర్థిక సంస్థలు, ప్రజాప్రతినిధుల పేర్లతో పోలిన యూజర్‌నేమ్‌లను దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందని పేర్కొంటూ ప్రభుత్వంతో సంప్రదింపులు పూర్తయ్యే వరకు ఈ ఫీచర్‌ను అమలు చేయొద్దని వాట్సాప్‌ను ఆదేశించింది. అలాగే ఫీచర్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, భద్రతా చర్యలపై మూడు రోజుల్లో నివేదిక సమర్పించాలని నోటీసు జారీ చేసింది. దీనిపై స్పందించిన వాట్సాప్ ప్రతినిధి ప్రస్తుతం యూజర్‌నేమ్‌లను రిజర్వ్ చేసుకునే అవకాశం మాత్రమే కల్పించామని, యూజర్‌నేమ్ ఆధారంగా మెసేజింగ్ సేవ ఇంకా ప్రారంభం కాలేదని స్పష్టం చేశారు. ప్రముఖులు, ప్రభుత్వ సంస్థలు, సెలబ్రిటీలు, మెటా వెర్గి÷డ్ ఖాతాలకు సంబంధించిన యూజర్‌నేమ్‌లను వారి అసలు యజమానుల కోసమే రిజర్వ్ చేసినట్లు తెలిపారు. అలాగే యూజర్‌నేమ్‌ను కచ్చితంగా తెలుసుకోవాల్సిన విధానం, యూజర్‌నేమ్ కీ, అనుమానాస్పద కార్యకలాపాల గుర్తింపు, మోసాల నివారణ వంటి పలు భద్రతా చర్యలను అమలు చేస్తున్నట్లు వివరించారు. వాట్సాప్‌ను ఉపయోగించడానికి మొబైల్ నంబర్ తప్పనిసరిగా కొనసాగుతుందని కూడా స్పష్టం చేశారు.

## సీఎం పర్యటనలో అలసత్వం ప్రదర్శిస్తే

# కఠిన చర్యలు తప్పవు

### ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్





**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 4వ తేదీన నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండల పరిధిలోని ఉరుకొండపేట ఆంజనేయస్వామి దేవాలయాన్ని సందర్శించనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్‌తో కలిసి ఉరుకొండపేటలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయాన్ని సందర్శించి జరుగుతున్న ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న నూతన హెలిప్యాడ్ నిర్మాణ పనులను కలెక్టర్, ఎస్పీ అధికారులతో కలిసి పరిశీలించి సంబంధిత శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. హెలిప్యాడ్ నుంచి ఆలయానికి ముఖ్యమంత్రి ప్రయాణించే మార్గం, భద్రతా ఏర్పాట్లు, ప్రజల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. అనంతరం ఆలయ ఈవో, అర్చకులతో సమావేశమైన కలెక్టర్, ముఖ్యమంత్రి నిర్వహించే ప్రత్యేక పూజలు, ప్రదక్షిణలు, పూర్ణకుంభ స్వాగతం, దర్శన ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్షించారు. ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. దేవాలయ దర్శనం అనంతరం ముఖ్యమంత్రి ఆలయ వెలుపల ఏర్పాటు చేసిన ప్రాంగణంలో కొంతమంది ప్రముఖులతో కలిసి మధ్యాహ్న భోజనంలో పాల్గొననున్న నేపథ్యంలో అక్కడి ఏర్పాట్లను కూడా కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. అతిథులకు అవసరమైన సౌకర్యాలు, భద్రత, పరిశుభ్రత, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య ఏర్పాట్లు పక్కాగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అన్ని అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని, ప్రతి శాఖ తమకు అప్పగించిన బాధ్యతలను సమన్వయంతో నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఉరుకొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి శాఖలవారీగా అప్పగించిన బాధ్యతలను మరోసారి సమీక్షించి అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి పర్యటన అత్యంత ప్రతిష్ఠాత్మకమైనదని పేర్కొన్న కలెక్టర్, ఏ ఒక్క అధికారి కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని స్పష్టం చేశారు. అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. విధుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెలిప్యాడ్ నుంచి ఆలయానికి చేరుకోవడం, దర్శనం అనంతరం ప్రముఖులతో భోజన కార్యక్రమం వరకు ప్రతి దశలో వివిధ శాఖల అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, రవాణా, వైద్య సేవలు, అగ్నిమాపక ఏర్పాట్లు, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి అంశాల్లో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా వీఐపీల పార్కింగ్ ప్రాంతాలు, ప్రధాన రహదారుల వెంట పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, పచ్చదనం పెంపొందించేలా మొక్కలు నాటాలని, పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని సంబంధిత శాఖలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా ప్రస్తుతం సాగు సీజన్ కొనసాగుతున్న నేపథ్యంలో మండల పరిధిలో రైతులకు విత్తనాలు, యూరియా కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రైతులకు అవసరమైన వ్యవసాయ ఇన్‌పుట్లు సకాలంలో అందుబాటులో ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రతి చిన్న అంశాన్ని కూడా అత్యంత ప్రాధాన్యంతో పరిగణించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు దేవ సహాయం, అరుణ రెడ్డి, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి, కల్వకుర్తి డి.ఎస్.పి, ఆలయ ఈవో సత్య చంద్రా రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మండ్రాజుపల్లి కొత్తూరు లో ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం

### ముఖ్య అతిథిగా తుంబూరు దయాకర్ రెడ్డి

### మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొడాలి గోవింద రావు


**క్రైమ్ మిర్రర్ పాలేరు :** నేలకొండపల్లి మండలం మండ్రాజూపల్లి లోని స్థానిక రామాలయం లో ధ్వజస్తంభ ప్రతిష్ట ఘనంగా జరిగింది. ఈకార్యక్రమానికి రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డి ,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొడాలి గోవింద రావు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజస్తంభం ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని,పాడి పంటల తో కళకళలాడాలని దేవున్ని వేడుకున్నారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు నాయకులు నెల్లూరి భద్రయ్య,వజ్జా శ్రీను నంబూరి రామారావు సర్పంచ్ లావూరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు




## క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు

## కంటెంట్ రైటర్లు కావలెను

### సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

**9393929595**


## ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలి

### జీవో నెంబర్ 7ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ..

### బీసీ జేఏసీ ఆధ్వర్యంలో కళాశాలల బంధు విజయవంతం



**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం, బీసీ జేఏసీ పిలుపు మేరకు గురువారం కల్వకుర్తి నియోజకవర్గంతో పాటు పట్టణంలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఇంటర్, డిగ్రీ కళాశాల బందు విజయవంతమైనట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విద్యార్థులకు పెండింగ్ ఫీజు రియం బర్స్మెంట్ డబ్బులు విడుదల చేయడంతో పాటు జీవో నెంబర్ 7 ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు బకాయిలు పేరుకుపో వడం వల్ల కళాశాల యజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడంలో ఇబ్బం దులకు గురిచేయడం వల్ల విద్యార్థులపై చదువులకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. దానితోపాటు చాలా వరకు విద్యార్థులు రాష్ట్రంలో ప్రభుత్వం నుండి అందే స్కాలర్షిప్ లతో చదువుకునే వారు ఉంటారు వారికి రాష్ట్రప్రభుత్వం నుంచి సమయానికి స్కాలర్షిప్లు రాక మధ్యలోనే విద్యను ఆపేసే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేసారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యాశాఖ పైన చిత్తశుద్ధి ఉంటే కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా ఫీజు బకాయిలను విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తుకి భరోసా నింపాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలలను కాపాడవలసిన బాధ్యత ఉన్న రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలను తగ్గిస్తానని చెప్పడం సరైనది కాదని, వెంటనే రాష్ట్రంలో మెగా డీఎస్సి ని నిర్వహించాచి గురుకుల పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించాలని చెప్పారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యావ్యవస్థని పటిష్టం చేయాలని బీసీ జేఏసీ కల్వకుర్తి తరఫున రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సబ్ ప్లాన్ సాధన సమితి అధ్యక్షులు మేకల రాజేందర్, బీసీ సంఘాల నాయకులు భాను చందర్, సురేష్ మోడీ, దారమోని గణేష్,శివ, సామ్రాట్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## మొదటి రోజు 6 నామినేషన్లు...

చండూరు, క్రైమ్ మిర్రర్: చండూరు చేనేత సహకార సంఘానికి ఎన్నికల నగార మోగిన విషయం తెలిసిందే ఇందులో భాగంగా రెండు, మూడు, నాలుగు తేదీలలో నామినేషన్ ప్రక్రియ ఉంది ఇందులో భాగంగా మొదటి రోజు ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. ఎన్నికల అధికారి మహబూబు అలీ నామినేషన్లు స్వీకరించారు. చండూరు చేనేత సహకార సంఘానికి మొత్తం తొమ్మిది మంది డైరెక్టర్లు ఉండాల్సి ఉంది. ఇందులో ఇద్దరు మహిళ డైరెక్టర్లు ఉండాలి. ఐదో తారీకు నామినేషన్ల పరిశీలన,స్క్రూట్నీ ఉంటుంది. 6వ తేది నామినేషన్ల ఉపసహరణ గుర్తుల కేటాయింపు ఉంటుంది.

## బేగంపేట కిమ్స్,భువనగిరి ఐఎంఎ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవ వేడుకలు



**ఆత్మకూరు(ఎం),,జూలై02/క్రైమ్ మిర్రర్:** జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ బేగంపేట్‌లోని కిమ్స్-సన్‌షైన్ హాస్పిటల్, భువనగిరి ఐఎంఎ ( ఇండియన్ మెడికల్ అసోసియేషన్) ఆధ్వర్యంలో బుధవారం రాత్రి యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని వివేరా హోటల్లో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ సమాజంలో వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని, భగవంతుడు జన్మనిస్తే, వైద్యులు పునర్జన్మ ప్రసాదిస్తారని ఆయన అన్నారు. వైద్యులు, ప్రజలతో ఆర్థిక సంబందాలు కాకుండా ఆత్మీయ బందాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ప్రతి డాక్టర్, ప్రజలందరూ క్షేమంగా ఉండాలని కోరుకుంటారని, కానీ కొందరు ప్రజలు ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేస్తూ, రోగాల బారిన పడుతున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కృష్ణ చైతన్య, కోశాధికారి డాక్టర్ కిరణ్, సభ్యులు డాక్టర్ ప్రశాంతి రెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్ రెడ్డి , బేగంపేట కిమ్స్-సన్‌షైన్ హాస్పిటల్‌కు చెందిన సీనియర్ న్యూరో ఫిజిషియన్ డాక్టర్ ఎ. నివేదిత సాయిచంద్ర, ప్రసూతిడ గైనకాలజీ నిపుణురాలు డాక్టర్ అశ్విని దేవరశెట్టి, సీనియర్ పల్మోనాలజిస్ట్ డాక్టర్ వి. లక్ష్మణ్ బాబు, సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ కె. సాయి కృష్ణ, సీనియర్ జనరల్ ఫిజిషియన్ డాక్టర్ కిరణ్ మాచా, కిమ్స్-సన్‌షైన్ హాస్పిటల్ డీజీఎం--బిజినెస్ డెవలప్‌మెంట్ అజయ్ ఠాకూర్, అసిస్టెంట్ మేనేజర్ యశ్వంత్ తదితరులు పాల్గొని అతిథులను ఆహ్వానించి సత్కరించారు. వైద్యుల సేవలను కొనియాడుతూ జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

## సంగారెడ్డి గురుకులాల్లో పార్ట్‌టైం టీచర్ల నియామకం

### జూలై 7లోగా దరఖాస్తులకు ఆహ్వానం




**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 02:** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ TGSWREIS ఆధ్వర్యంలోని సంగారెడ్డి జిల్లా పరిధిలోని 12 గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో 2026--27 విద్యా సంవత్సరానికి పార్ట్‌టైం ఉపాధ్యాయుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమన్వయ అధికారి జి. కల్పన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని చిట్కుల్, ఇస్నాపూర్, ఆందోల్, రంజోల్, రాయికోడ్ బాలికల గురుకుల పాఠశాలలు, అంబేద్కర్ కళాశాల, హత్నూర, కొండాపూర్, నారాయణఖేడ్, నల్లవాగు, సింగూర్, న్యాల్కల్ బాలుర గురుకుల పాఠశాలల్లో జూనియర్ లెక్చరర్, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్, ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్, స్పెషల్ టీచర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు జూలై 7 సాయంత్రం 4 గంటలలోపు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. డెమో తరగతులు జూలై 8 ఉదయం 10 గంటలకు చిట్కుల్‌లోని జిల్లా సమన్వయ అధికారి కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లు, విద్యా ధ్రువపత్రాలు, అనుభవ ధ్రువపత్రాలు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హాజరుకావాలని సూచించారు. నెలవారీ గౌరవ వేతనంగా జూనియర్ లెక్చరర్లకు రూ. 23,400, ౹ా+ు/ా+ులకు రూ. 18,200, స్పెషల్ టీచర్లకు రూ. 14,200 చెల్లిస్తామని వెల్లడించారు. నియామకాల విషయంలో సంస్థ నిర్ణయమే తుది నిర్ణయమని, అవసరమైతే నియామక ప్రక్రియలో మార్పులు చేసే హక్కు సంస్థకు ఉంటుందని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు జిల్లా సమన్వయ అధికారి కార్యాలయం, చిట్కుల్‌ను లేదా 97045 50253 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

# 'ఎస్ఐఆర్' పేరుతో పౌరుల ఓటు హక్కు తొలగించే కుట్రలను అడ్డుకోవాలి...

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో అర్హులైన ఓటర్లను తొలగించే కేంద్ర ప్రభుత్వ కుట్రను తిప్పికొట్టాలి...

## ఖమ్మం నగరం లో అఖిల పక్ష పార్టీల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన...





**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఓటు హక్కు భారత రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన ప్రజాస్వామ్య హక్కు అని, 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లను జాబితాల నుంచి తొలగించే కేంద్ర ప్రభుత్వ కుట్రను ప్రజలంతా ఐక్యంగా అడ్డుకోవాలని అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఖమ్మంలోని పాత బస్టాండ్ నుండి జడ్పీ సెంటర్ వరకు అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర నాయకులు భాగం హేమంతరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు ఆవుల అశోక్ మాట్లాడారు. వక్తలు మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాల్సిన ఎన్నికల సంఘంపై కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి 'ఎస్ఐఆర్' పేరుతో లక్షలాది మంది అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించే ప్రయత్నాలు చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఇది తీవ్రమైన ముప్పు అని పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాల్సిన సమయంలో ప్రజల ఓటు హక్కును బలహీనపరిచే చర్యలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. ఓటర్ల జాబితాల్లో అక్రమాల పేరుతో నిజమైన ఓటర్లను తొలగించడం ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేసే చర్య అని అన్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి తమ ఓటు హక్కును కాపాడుకోవాలని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేపట్టే ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష పార్టీల నాయకులకు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ , నాగండ్ల దీపక్ చౌదరి, వై విక్రమ్, షేక్ జానీమియా, కమర్తపు మురళి, సౌజన్య, జితేందర్ రెడ్డి, కమర్తపు మురళి, జి. రామయ్య, యర్రా శ్రీనువాసురావు, మెరుగు సత్యనారాయణ, సలాం, సీతామహాలక్ష్మి, సాంభశివ రెడ్డి, జబ్బార్, మీరా సాహెబ్, నవీన్ రెడ్డి, పుల్లయ్య, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



## అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్

**కుత్బుల్లాపూర్, జూలై 02 (క్రైమ్ మిర్రర్):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని సంజీపురి కాలనీలో పోచమ్మ దేవాలయం పునర్నిర్మాణం, విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్లు కొలుకుల జగన్, మంత్రి సత్యనారాయణ, సురేష్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. తెలంగాణ సాంప్రదాయంలో ముఖ్యంగా హైదరాబాద్ సంస్కృతిలో బోనాల ఉత్సవాలకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుందని అన్నారు. భగవంతుని పూజించడం వలన క్రమశిక్షణ తో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. బోనాల ఉత్సవాలకు ఆలయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిన కమిటీ సభ్యులకు మరోసారి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు. అరుణ్ రెడ్డి, ప్రవీణ్ కుమార్ గుప్తా, శ్రీనివాస్, బాలు, శ్రీకాంత్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, బాబు, భాస్కర్, సునీల్ రెడ్డి, సంపత్ రెడ్డి, బసవేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి నగర్ 'ఒకరోజు-ఒక వార్డు'లో కమిషనర్ శ్రీజన

### డిప్యూటీ కమిషనర్ సాబీర్ అలీపై తీవ్ర అసహనం..



**నిజాంపేట, జూలై 2 (క్రైమ్ మిర్రర్):** నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతి నగర్ ఎన్టీఆర్ పార్కులో గురువారం 'ఒకరోజు-ఒక వార్డు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. శ్రీజన పాల్గొని స్థానిక ప్రజా సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీల్లో నెలకొన్న చిన్న చిన్న సమస్యలు సైతం ప్రజలు నేరుగా తన దృష్టికి తీసుకురావడంపై కమిషనర్ తీవ్రంగా స్పందించారు. స్థానిక సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తున్న నిజాంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సాబీర్ అలీపై ఆమె తీవ్ర అసహనం వ్యక్తం చేశారు."స్థానిక కాలనీల్లోని చిన్న చిన్న సమస్యలను పరిష్కరించడంలో కనీస చొరవ చూపడం లేదు. ప్రజలు ఇన్ని చిన్న సమస్యలను నా దృష్టికి తెస్తున్నారంటే.. మీరు క్షేత్రస్థాయిలో అసలు పర్యటించడం లేదని స్పష్టంగా అర్థమవుతోంది" అంటూ డిప్యూటీ కమిషనర్ సాబీర్ అలీని కమిషనర్ శ్రీజన నిలదీశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీజన వెంట కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్, ఇతర స్థానిక అధికారులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో ప్రగతి నగర్ నాయకులు మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధి

### మార్కెట్ కమిటీ ఛైర్మన్ బిఎస్ ఆంజనేయులు గ్రామ సర్పంచ్ చంద్రభూపాల్

### ఎస్ డిఎఫ్ నిధులతో మంజూరైన డ్రైనేజ్ నిర్మాణానికి భూమి పూజ

**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని కుల్కచర్ల మార్కెట్ కమిటీ ఛైర్మన్ బిఎస్ ఆంజనేయులు, ముజాహిద్ పూర్ గ్రామ సర్పంచ్ చంద్రభూపాల్ సూచించారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలోని ముజాహిద్పూర్ గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి ఆదేశాలతో మంజూరైన ఐదు లక్షల ఎస్ డిఎఫ్ నిధులతో గురువారం చేపట్టిన సైడ్రైన్ నిర్మాణ పనులకు పూజా నిర్వహించి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి బోళ్ళ భవాని భీమయ్య, వార్డు సభ్యులు సర్దార్ మీద, బోయిని కృష్ణయ్య, ఎండి షర్ఫుద్దీన్, సోషల్ మీడియా కన్వీనర్ బీమ్ భాస్కర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వేముల రాములు, ఉప్పు సోమలింగం, అంబుదాసు, కాకి ఆనందం,ఎండి.హాజి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వ భావాలను పెంపొందిస్తాయి





### దేవాలయాలు సమాజంలో ఐక్యత, భక్తి భావం సాంస్కృతిక విలువలను పెంపొందించే ఆధ్యాత్మిక కేంద్రాలుగా నిలుస్తాయి

### తెలంగాణ రాష్ట్ర పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్

**కూకట్ పల్లి, జూలై 02 (క్రైమ్ మిర్రర్) :** బోరబండలో శివాజి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్కినాపురం లక్ష్మణ్ గౌడ్ ఆహ్వానం మేరకు శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ నూతన దేవాలయ యంత్ర విగ్రహ సింహ వాహన శిఖర ప్రతిష్ట మహోత్సవానికి తెలంగాణ రాష్ట్ర పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, పీసీసీ సభ్యులు,టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం ముఖ్య అతిథులుగా హాజరై స్థానిక నాయకులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించి, వేద పండితులు వేదాశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మహేష్ కుమార్ గౌడ్ ని డా. సత్యం శ్రీరంగం ను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ నల్లపోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజానికి శాంతి, సత్సంకల్పాలు కలిగిస్తాయని, ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అమ్మవారి దీవెనలు, కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో సమృద్ధి వర్షాలతో పాడిపంటలతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకోవడం జరిగింది. దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. హైదరాబాద్ లో నెల రోజుల పాటు జరిగే ఆషాఢ బోనాల ఉత్సవాలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. భక్తిశ్రద్ధలతో ఈ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులను అభినందించి, వారి సేవా భావాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, డివిజన్ ల అధ్యక్షులు మొయినుద్దీన్, కృష్ణ రాజ్ పుత్, విఠల్ రెడ్డి, నరసింహా యాదవ్, కనకయ్య, లక్ష్మీనారాయణ, సుంకన్న, మస్తాన్ రెడ్డి, భారతమ్మ, కలికోట శంకర్, రాజేష్ గౌడ్, పల్లపు వేణు, చోట మొయిజ్, అహ్మద్ వాజీద్ పాషా, సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఏవీబీ పురం ప్రజల సమస్యలపై జనసేన పోరాటం

### రోడ్ నంబర్-11లో డ్రైనేజీ, మంచినీటి లైన్ ఏర్పాటు చేయాలని అధికారులకు వినతి

### జనసేన పార్టీ కాంటెస్టెడ్ అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్



**కూకట్ పల్లి, జూలై 02 (క్రైమ్ మిర్రర్) :** కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఏవీబీ పురం కాలనీలో ప్రాథమిక వసతుల కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రోడ్ నంబర్-11లో నివసిస్తున్న వందకు పైగా కుటుంబాలకు ఇప్పటికీ డ్రైనేజీ వ్యవస్థ, మంచినీటి పైప్‌లైన్ లేకపోవడంతో నిత్యజీవితం కష్టసాధ్యంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం జనసేన పార్టీ నాయకత్వంలో కాలనీవాసులు మరోసారి అధికారుల దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లారు. కూకట్‌పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ కాంటెస్టెడ్ అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ సూచనల మేరకు, ఏవీబీ పురం కాలనీ అధ్యక్షుడు సీమాద్రి, జనసేన నాయకులు, కాలనీ ప్రతినిధులు కలిసి భారత్‌నగర్‌లోని వాటర్ వర్క్స్ శాఖ కార్యాలయానికి వెళ్లి సంబంధిత మేనేజర్ సయ్యద్ అబ్దుల్ జాకేను కలిశారు. ఈ సందర్భంగా రోడ్ నంబర్-11లో నివసిస్తున్న ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరంగా తెలియజేస్తూ, వెంటనే డ్రైనేజీ వ్యవస్థతో పాటు మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు. వినతిపత్రంలో, కాలనీలో దాదాపు వంద కుటుంబాలు ఎన్నో సంవత్సరాలుగా కనీస మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నాయని, డ్రైనేజీ లేకపోవడంతో మురుగునీరు నిల్వ ఉండి దుర్వాసన, దోమల బెడద పెరుగుతోందని, అలాగే మంచినీటి సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు అత్యవసరంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. విషయం తెలుసుకున్న వెంటనే వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ స్వయంగా ఏవీబీ పురం రోడ్ నంబర్-11ను సందర్శించారు. అక్కడి పరిస్థితులను పరిశీలించి, బాధిత కుటుంబాలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటుకు అవసరమైన చర్యలను త్వరితగతిన ప్రారంభించి, సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అధికారులు వెంటనే స్పందించి కాలనీకి వచ్చి పరిస్థితులను పరిశీలించడం పట్ల జనసేన నాయకులు, స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను సానుకూలంగా స్వీకరించి పరిష్కారానికి ముందుకు వచ్చిన వాటర్ వర్క్స్ అధికారులకు ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, కాలనీ అధ్యక్షుడు సీమాద్రి, స్థానిక ప్రజలు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ, ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు అందించడం ప్రభుత్వాల బాధ్యత అని, ఏవీబీ పురం ప్రజలు చాలా కాలంగా ఎదురుచూస్తున్న ఈ సమస్యలు ఇకపై ఆలస్యం కాకుండా పరిష్కారం కావాలని కోరారు. అవసరమైతే ప్రజల తరఫున మరింతగా ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా శంకర్, వేముల మహేష్, టి. ప్రసాద్, దుర్యోధన, మోహన్‌రావుతో పాటు కాలనీవాసులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక ప్రజలు కూడా అధికారుల హామీతో త్వరలోనే తమ కాలనీలో డ్రైనేజీ, మంచినీటి సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆర్జేడీ సోమిరెడ్డి చొరవతో వెల్దండ తెలంగాణ మోడల్ స్కూల్‌కు నూతన కళ

## సీఎస్ఆర్ నిధులతో రూ.30 లక్షల అభివృద్ధి పనులు పూర్తి

## రెండో విడతలో రూ.10 లక్షలతో సుందరీకరణకు శ్రీకారం

## యూత్ ఫర్ సేవా సంస్థ ప్రతినిధులతో కలిసి ప్రారంభించిన ఆర్జెడి యం సోమిరెడ్డి





**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి మౌలిక వసతులు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రాంతీయ విద్యాశాఖ సంచాలకులు (ఆర్జేడీ) ఎం. సోమిరెడ్డి చేసిన ప్రత్యేక చొరవ ఫలించింది. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ నేడు పూర్తిగా కొత్త రూపును సంతరించుకుని ఆదర్శ విద్యాసంస్థగా మారుతోంది. గతంలో వివిధ సమస్యలతో ఉన్న భవనం ప్రస్తుతం ఆకర్షణీయంగా మారడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వెల్దండ తెలంగాణ మోడల్ స్కూల్ లో పనిచేసే పిజిసిఆర్టి కవిత, ఆర్జేడీ ఎం. సోమిరెడ్డి కలిసి పాఠశాలలోని మౌలిక వసతులను తీర్చేలా విజ్ఞప్తి చేశారు. ఆర్జెడి సోమిరెడ్డికి పూర్తి స్థాయి నివేదికలు అందజేయడంతో తరగతి గదుల్లో వర్షాకాలంలో పైకప్పుల నుంచి నీరు కారడం, గోడలు దెబ్బతినడం, మరుగుదొడ్లలో సరైన సౌకర్యాలు లేకపోవడం, స్వచ్ఛమైన తాగునీటి కొరత, పాడైపోయిన ఫ్లోరింగ్, పరిసరాల నిర్లక్ష్య పరిస్థితి వంటి అనేక సమస్యలను ప్రత్యక్షంగా ఆర్జెడి కి పిజిసిఆర్టి కవిత నివేదించారు. ఈ సమస్యలు విద్యార్థుల చదువుకు తీవ్ర ఆటంకంగా మారుతున్నాయని గుర్తించిన ఆయన వెంటనే వాటి పరిష్కారానికి చర్యలు ప్రారంభించారు. ఈ సందర్భంగా బెంగళూరు, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ స్వచ్ఛంద సంస్థ యూత్ ఫర్ సేవా ప్రతినిధులతో సమావేశమై, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల ద్వారా వెల్దండ మోడల్ స్కూల్‌ను దత్తత తీసుకుని సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ విద్యాభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని ఆయన కోరగా, సంస్థ ప్రతినిధులు సానుకూలంగా స్పందించి పాఠశాల అభివృద్ధికి ముందుకొచ్చారు. ఆర్జేడీ సూచనల మేరకు మొదటి విడతలో సుమారు రూ.30 లక్షల వ్యయంతో పాఠశాలలో విస్తృత స్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టారు. భవనానికి పూర్తిస్థాయిలో నాణ్యమైన పెయింటింగ్ చేయడంతో పాటు, వర్షాకాలంలో గదుల్లో నీరు కారే సమస్యను శాశ్వతంగా నివారించేలా పైకప్పులకు ప్రత్యేక మరమ్మతులు చేపట్టారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆధునిక సౌకర్యాలతో మరుగుదొడ్లను పునర్నిర్మించారు. పరిశుభ్రమైన తాగునీటి వసతిని ఏర్పాటు చేయడంతో పాటు, పాడైపోయిన నేలను తొలగించి ఆధునిక ఫ్లోరింగ్ వేశారు. దీంతో పాఠశాల భవనం పూర్తిగా కొత్త కళను సంతరించుకుని విద్యార్థులకు సౌకర్యవంతమైన, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని అందిస్తోంది. బుధవారం పాఠశాలను సందర్శించిన యూత్ ఫర్ సేవా ప్రతినిధులు బెంగళూరుకు చెందిన ఆశికా, హైదరాబాద్ కు చెందిన అరవింద్, ప్రిన్సిపల్ శ్రీధర్ ల తో కలిసి ఆర్జేడీ ఎం. సోమిరెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులను స్వయంగా పరిశీలించి ప్రారంభించారు. పాఠశాల ప్రిన్సిపాల్‌తో సమావేశమై ఇప్పటివరకు పూర్తయిన పనులు, వాటి నాణ్యత, విద్యార్థులకు అందుతున్న ప్రయోజనాలపై సమీక్ష నిర్వహించారు. పనుల అమలు తీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, ప్రభుత్వ పాఠశాలలు కూడా ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ఉండాలంటే ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆయన తెలిపారు. అదేవిధంగా రెండో విడతలో మరో రూ.10 లక్షల సీఎస్ఆర్ నిధులతో విద్యార్థులకు బ్యాగులు, షూ పంపిణీతోపాటు పాఠశాల సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. పాఠశాల ప్రహరీ గోడలు, భవనం గోడలపై విద్యార్థుల్లో సృజనాత్మకత, విజ్ఞానాసక్తిని పెంపొందించే విద్యా సంబంధిత చిత్రలేఖనాలు, శాస్త్రవేత్తలు, జాతీయ నాయకులు, ప్రకృతి దృశ్యాలు, నైతిక విలువలను ప్రతిబింబించే చిత్రాలతో బ్యూటిఫికేషన్ పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయిన అనంతరం పాఠశాల జిల్లా స్థాయిలోనే ఆదర్శ మోడల్ స్కూల్‌గా నిలుస్తుందని ఆర్జెడి సోమిరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధిలో అధికారుల చొరవతో పాటు స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు భాగస్వాములు కావడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అత్యుత్తమ మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయని ఆర్జేడీ ఎం. సోమిరెడ్డి పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇలాంటి కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు. వెల్దండ తెలంగాణ మోడల్ స్కూల్‌లో జరిగిన ఈ మార్పులను చూసిన విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ, పాఠశాల అభివృద్ధికి విశేష కృషి చేసిన ఆర్జేడీ ఎం. సోమిరెడ్డి, యూత్ ఫర్ సేవా సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

# బాలాజీ స్వర్ణపురి కాలనీలో విస్తృతంగా సర్ వెరిఫికేషన్

## ప్రజలు సహకరించాలని మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ పిలుపు



**కూకట్ పల్లి, జూలై 02 (క్రైమ్ మిర్రర్) :** కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఓటరు జాబితా ప్రక్షాళన ప్రక్రియను మరింత పారదర్శకంగా, తప్పులులేని విధంగా నిర్వహించేందుకు భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు ఉమ్మడి మూసాపేట్ డివిజన్ పరిధిలోని బాలాజీ స్వర్ణపురి కాలనీలో గురువారం ప్రత్యేక వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ స్వయంగా పాల్గొని, బూత్ లెవల్ ఆఫీసర్లు, బీఆర్ఎస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు తో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రతి అర్హుడి పేరు నమోదయ్యేలా అవసరమైన ధ్రువీకరణ ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా తూము శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రతి ఒక్కరూ వెరిఫికేషన్ ప్రక్రియకు సహకరించాలని కోరారు. ఇంటింటికీ వస్తున్న బీఎల్ఓలకు సరైన వివరాలు, అవసరమైన పత్రాలు అందించి ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచనల మేరకు నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో సర్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ, ఓటరు జాబితాను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయడమే లక్ష్యంగా అధికారులు, పార్టీ ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ వర్షిని, మాజీ ప్రధాన కార్యదర్శి తిరుపతి, రాజ్ కుమార్ గౌడ్, సత్యనారాయణతో పాటు స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, బీఎల్ఓ లు, బీఎల్ఏలు పాల్గొని వెరిఫికేషన్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారు. ప్రజలందరూ ఓటరు జాబితా వెరిఫికేషన్‌ను నిర్లక్ష్యం చేయకుండా, తమ వివరాలను ఒకసారి పరిశీలించి అవసరమైతే సవరణలు చేయించుకోవాలని నిర్వాహకులు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ ప్రత్యేక కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని వారు స్పష్టం చేశారు.

# దేశ ప్రధాని నరేంద్ర మోడీని విమర్శించే స్థాయి సీఎం రేవంత్ రెడ్డికి లేదు

**ప్రపంచ దేశాలు మెచ్చిన నాయకుడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ**

**బీజేవైఎం పరిగి నియోజకవర్గం కన్వీనర్ గడుసు మైపాల్**



**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** దేశ ప్రధాని నరేంద్ర మోడీని విమర్శించే స్థాయి సీఎం రేవంత్ రెడ్డికి లేదు అని, ఆయన స్థాయికి మించి మాట్లాడడం మానుకోవాలని పరిగి నియోజకవర్గ కన్వీనర్ గడుసు మైపాల్ హెచ్చరించారు. హైదరాబాదులోని శిల్పారామంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో బిజెపి పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ మాట్లాడిన మాటలను తప్పు పట్టడం సరైన పద్ధతి కాదని, ఆయన స్థాయి మించి మాట్లాడడం మానుకోవాలని అన్నారు. దేశంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించిన భారతీయ జనతా పార్టీ రాబోయే 2028 ఎన్నికల్లో తెలంగాణలో అధికారంలోకి రావడం ఖాయమని నితిన్ నబిన్ చెప్పిన మాటలను తప్పు పట్టడం సరైన పద్ధతి కాదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్న 420 హామీలు ఇచ్చి ఒక్క హామీ కూడా నెరవేర్చ లేదని, బిజెపి ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి నిధులు ఇవ్వలేదు అనడం విడ్డూరంగా ఉందని అన్నారు. భారతీయ జనతా పార్టీ అధికారంలోనికి వచ్చి 12 సంవత్సరాలు ముగించుకొని ఎన్నో ఘనతలు సాధించి ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో భారతదేశంలో ఒక ఆర్థిక శక్తిగా ముందుకు వెళుతుందని వారు తెలిపారు. నితిన్ నితిన్ 26 ఏళ్లకే ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడిగి పెట్టిన నాయకుడని, వరుసగా ఏడుసార్లు ప్రజల మెప్పుతో ఎమ్మెల్యేగా గెలిచాడని, బిజెపి కార్యకర్తగా మొదలుపెట్టి అతి చిన్న వయసులోని ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీకి జాతీయ అధ్యక్షుడిగా ఎదిగాడని ఆయనను పట్టుకొని రేవంత్ రెడ్డి విమర్శించడం సరైన పద్ధతి కాదని వారు అన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి వదిలేసి ప్రతిపక్ష పార్టీలను విమర్శించడం మానుకోవాలని తెలంగాణలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వారు పేర్కొన్నారు.



## గొట్టిముక్కల పద్మారావు దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్న కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్

**కూకట్ పల్లి, జులై 02 (క్రైమ్ మిర్రర్) :** దివంగత రాజకీయ నేత గొట్టిముక్కల పద్మారావు దశదిన కార్యక్రమం గురువారం వివేకానంద నగర్ కాలనీలోని ఆయన స్వగృహంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిపిసిసి ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ స్థానిక నాయకులతో కలిసి హాజరయ్యారు. పద్మారావు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ పరంగా ఉద్యమ సమయంలో ఆయన చేసిన సేవలను రమేష్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్ పత్రాలు పంపిణి విషయంలో నిర్లక్ష్యం వీడాలి

**అధికారులకు ఆదేశాలు జారీ చేసిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**



**బాలానగర్, జులై 02 (క్రైమ్ మిర్రర్) :** ఎస్ ఐ ఆర్ సర్వే సందర్భంగా అధికారులు నిత్యం పర్యవేక్షించాలని ఓటర్లకు సహాయ సహకారాలు అందించి వారి ఓట్లు రద్దు కాకుండా చూడాలని కూకట్ పల్లి శాసన సభ్యుడు మాధవరం కృష్ణారావు సూచించారు. ఎస్ ఐ ఆర్ లో భాగంగా కూకట్ పల్లి నియోజకవర్గంలో ఓటర్లకు ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీ సందర్భంగా ఫతేనగర్ డివిజన్ లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా బి ఎల్ వో లు ఎవరు మా వద్దకు రాలేదు అని స్థానిక ప్రజలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణ రావు జడ్.సి. కి ఫోన్ చేసి ఎస్ ఐ ఆర్ పత్రాలు పంపిణి విషయంలో నిర్లక్ష్యం వీడాలని ఆదేశించారు. బి ఎల్ వో ల తో పాటు స్థానిక బి ఎల్ ఏ లు తో కూడా ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగస్వాములు కావాలని అర్హులైన ఓటర్లకు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఒక్క ఓటు కూడా తొలగించడానికి వీల్లేదని, ఏవైనా ఇబ్బందులు సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం తో పాటు తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమలో బి.ఆర్.ఎస్.పార్టీ మెంబర్ షిప్ ఇంచార్జి గజ్జల నగేష్, మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కిష్టారెడ్డిపేట్‌లో అగ్నిప్రమాదం..

**డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ పూర్తిగా దగ్ధం**

**బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఈర్ల రాజు ముదిరాజ్**



**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 02:** పటాన్‌చెరు నియోజకవర్గంలోని అమీన్పూర్ మండలం కిష్టారెడ్డిపేట్ దుర్గా నగర్ కాలనీలో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో తోషిబా ఫ్యాక్టరీలో పనిచేస్తున్న రాంబాబు డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ఫ్లాట్‌లోని గృహోపకరణాలు, విలువైన వస్తువులు పూర్తిగా దగ్ధమైనట్లు సమాచారం. అగ్నిప్రమాదం విషయం తెలుసుకున్న అమీన్పూర్ బీజేపీ మండల అధ్యక్షుడు ఈర్ల రాజు ముదిరాజ్ సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అగ్నిప్రమాదంలో ఆస్తి నష్టం జరగడం బాధాకరమని, బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా సహాయం అందించాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో దుర్గా నగర్ అసోసియేషన్ అధ్యక్షుడు సముద్రాల రాకేష్ గుప్తా, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు రాజేందర్ గౌడ్, మండల కార్యదర్శి వెంకట్ తదితరులు పాల్గొని బాధిత కుటుంబానికి తమ సానుభూతి తెలిపారు.

# ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పురస్కారం అందజేత





**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** చదువులో విద్యార్థులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గొడుగు పరమేష్ తన సొంత నిధులతో నగదు పురస్కారాలు అందజేశారు. కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జెడ్పిహెచ్ఎస్ లో గురువారం కల్వకుర్తి మండలంలోని 11 ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గొడుగు పరమేష్ స్వచ్ఛందంగా తన సొంత నిధులతో నగదు పురస్కారం అందజేసి ఘనంగా సన్మానించారు. మండల టాపర్ కల్వకుర్తి జెడ్పి గర్ల్స్ హై స్కూల్ కి చెందిని కె.శివాని కి రూ.10వేలు నగదు బహుమతి, ప్రశంసాపత్రం మరియు జ్ఞాపిక అందజేసి అభినందించారు. అలాగే రెండవ స్థానంలో జెడ్పిహెచ్ఎస్ గర్ల్స్ కల్వకుర్తి విద్యార్థిని బి.సాయి చందన కి రూ. 5వేలు నగదు బహుమతి, ప్రశంసా పత్రం, జ్ఞాపికతో సత్కరించారు. అలాగే మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాల మెరిటీ విద్యార్థులకు రూ.2 వేలు నగదు బహుమతితో పాటు జ్ఞాపిక మరియు ప్రశంస పత్రంతో సత్కరించడం జరిగింది. విదార్థుల తల్లిదండ్రులతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుల కు జ్ఞాపికతో సత్కరించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ముఖ్య అతిథులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు గొడుగు పరమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ దాగి ఉందని, అలాంటి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించి మరింత మంది విద్యార్థులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తామని చెప్పారు. విద్యార్థుల విజయాల్లో ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల త్యాగం ఎంతో కీలకమని, సమాజంలోని ప్రతి ఒక్కరూ విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు విజేతలను అభినందించారు.

# నిర్ణిత షెడ్యూల్ ప్రకారం యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**వైరా కేంద్రంలో అత్యాధునిక సదుపాయాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం**

**విద్యతో పాటు క్రీడలు, సాంకేతిక విద్యకు అనుగుణంగా అన్ని వసతుల కల్పన**



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా సమీకృత గురుకులాల పనులను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం వైరా నియోజకవర్గ పర్యటనలో భాగంగా వైరా పట్టణంలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్మాణ ప్రాంతాలను కాలినడకన పరిశీలిస్తూ భవనాల నమూనా మ్యాపులు, పనుల పురోగతి, నాణ్యత ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రతి పనిని సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థుల రాకపోకలకు అనువుగా లింక్ రోడ్లు, అంతర్గత రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, పచ్చదనం వంటి మౌలిక వసతులను సమగ్రంగా అభివృద్ధి చేయాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రణాళికా బద్ధంగా అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ప్రపంచస్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా సమీకృత గురుకులాలను ఏర్పాటు చేస్తోందన్నారు. లివిద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంకేతిక నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసంలోనూ రాణించేలా అత్యాధునిక మౌలిక వసతులతో ఈ విద్యాసంస్థలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన, సమాన అవకాశాలు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలను నిర్మిస్తోందని పేర్కొన్నారు. సామర్థ్యం కలిగిన విద్యార్థులను తీర్చిదిద్దేందుకు అవసరమైన విద్యా వాతావరణాన్ని ఈ గురుకులాలు అందిస్తాయని అన్నారు. నిర్మాణ సంస్థలు, ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతిరోజూ పనుల పురోగతిని పర్యవేక్షిస్తూ, నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట వైరా తహసీల్దార్ సురేష్, మున్సిపల్ కమిషనర్ రామచందర్ రావు, ఇంజినీరింగ్ అధికారులు, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ అభయ హస్తం పథకం ద్వారా ప్రతి దళిత కుటుంబానికి 12 లక్షల ఆర్థిక సహాయం

**విద్యా రిజర్వేషన్ కార్పొరేట్ విద్యా సంస్థలలో 25 శాతం ఉచిత విద్యను కచ్చితంగా అమలు చేయాలి**

**ఎస్సీ ఎస్టీ బీసీ ముస్లిం మైనారిటీ ల సబ్ ప్లాన్ నిధులు వెంటనే మంజూరు చేయాలి**




**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఖమ్మం జిల్లా ఎమ్మార్పీఎస్ టీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం జడ్పీ మీటింగ్ హాల్లో ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎమ్మార్పీఎస్ టీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు లంక వెంకటేశ్వర్లు (ఎల్.వి.ఆర్) మాదిగ , స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేదాశి మోహన్ మాదిగ లు పాల్గొని మాట్లాడారు . డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ అభయ హస్తం పథకం ద్వారా ప్రతి దళిత కుటుంబానికి 12 లక్షల ఆర్థిక సహాయం తక్షణమే అందించాలి విద్యా రిజర్వేషన్ కార్పొరేట్ విద్యా సంస్థలలో 25 శాతం ఉచిత విద్యను కచ్చితంగా అమలు చేయాలి గత ప్రభుత్వం దళిత బందు సగం డబ్బులిచ్చి సగం డబ్బులు ఇవ్వలేదు వాటిని వెంటనే మంజూరు చేయాలి ఎస్సీ ఎస్టీ బీసీ ముస్లిం మైనారిటీ ల సబ్ ప్లాన్ నిధులు వెంటనే మంజూరు చేయాలి రాష్ట్ర వ్యాప్తంగా సమాధులు లేని గ్రామాలలో సమాధులకు స్థలం వెంటనే కేటాయించాలని అలాగే విద్యా ఉద్యోగ రిజర్వేషన్లు అమలు చేయాలి మున్సిపల్ కార్మికులకు వేతనం పెంచాలని కోరారు . ఈ కార్యక్రమములో మాదిగ ఉద్యోగస్తుల సంఘం జిల్లా అధ్యక్షులు కుక్కల శ్రీనివాస్ మహిళ మండలి జిల్లా అధ్యక్షురాలు మెల్లచెరువు నాగమణి జిల్లా అధ్యక్షులు హెచ్చు వెంకటేశ్వర్లు కుక్కల రాములు పొట్టపింజర వెంకట రత్నం మేకల వెంకటేశ్వర్లు గంధం జగజీవన్ రావు విద్యార్ధి సంఘం జిల్లా అధ్యక్షులు కరిస ఉపేందర్ ముదిగొండ మండల అధ్యక్షులు కొత్తపల్లి నరసింహ కొత్తగూడెం జిల్లా ఇంచార్జీ లంక బాబురావు చింతకాని మండల అధ్యక్షులు సింగారపు బాబురావు జిల్లా నాయకులు కంభంపాటి రాజా రత్నం చిరమర్తి దుర్గా ప్రసాద్ రిటైర్డ్ ఉద్యోగులు సంఘం జిల్లా అధ్యక్షులు శనగల వీరస్వామి రఘునాథ పాలెం మండల అధ్యక్షులు రామారావు సందీప్ తదితరులు పాల్గొన్నారు

# నూతన కమిషనర్ గణేష్ నాయక్ ను బీఆర్ఎస్ నేతలు ఘన సన్మానం



**పెబ్బేరు జూలై 02 క్రైమ్ మిర్రర్:** పెబ్బేరు మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన గణేష్ నాయకు ను బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు దిలీప్ రెడ్డి ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 12వ వార్డు కౌన్సిలర్ సౌజన్యతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పెబ్బేరు పట్టణం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజలకు మెరుగైన మున్సిపల్ సేవలు అందించాలని, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థ, వనపర్తి రోడ్ రహదారుల అభివృద్ధి వంటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ గణేష్‌ను కోరారు. ఈ సందర్భంగా దిలీప్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తూ పెబ్బేరు పట్టణ అభివృద్ధికి కమిషనర్ పూర్తి స్థాయిలో కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కౌన్సిలర్ సౌజన్య మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉండే పాలన అందించి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెబ్బేరు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధురాలి బలవన్మరణం



**రామకృష్ణాపూర్, జూలై 2:** పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌లో శారీఫ్‌బీ (71) అనే వృద్ధురాలు ఇంట్లో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. భర్త రెండేళ్ల క్రితం మృతిచెందిన తర్వాత ఆమె మానసికంగా కలత చెందుతూ ఉండేదని కుటుంబ సభ్యులు తెలిపారు. కుమారుడు సయ్యద్ బాబా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై శ్రీధర్ తెలిపారు.

# కాసిపేట్-2 ఇంక్లయిన్‌లో జీఎం తనిఖీ

**భద్రతతో పాటు బొగ్గు నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి**



**మందమర్రి, జూలై 2 (క్రైమ్ మిర్రర్):** మందమర్రి ఏరియా పరిధిలోని కాసిపేట్-2 ఇంక్లయిన్ గనిని ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ గురువారం తొలి షిఫ్ట్‌లో సందర్శించారు. గని అంతర్భాగంలోకి వెళ్లిన ఆయన కార్మికులు పనిచేస్తున్న ప్రాంతాలను, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఉత్పత్తి లక్ష్యాల సాధనతో పాటు బొగ్గు నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఉత్పత్తి ఎంత ముఖ్యమో, ఉద్యోగులు భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించడం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. ప్రమాద రహితంగా విధులు నిర్వహించాలని, రక్షణ చర్యల్లో ఎలాంటి రాజీ ఉండకూడదని ఉద్యోగులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గని సర్వేయర్ తిరుపతి, ఉన్నతాధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కును అందించిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోపాల్ నాయక్,గ్రామ సర్పంచ్ ఎర్రం పోటి మల్లేష్




**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం ఇప్పాయిపల్లి గ్రామంలో పరిగి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ టి రామ్మోహన్ రెడ్డి ఆదేశానుసారంగా ఏంకంటి నరసమ్మ భర్త పేరు బాలయ్య 175000 ఒక లక్ష 75 వేల రూపాయల చెక్కును కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్ ఇప్పాయిపల్లి గ్రామ సర్పంచ్ ఎర్రం పోటీ మల్లేష్ గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి లబ్ధిదారులకు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, రాంపూర్ గ్రామ సర్పంచ్ తిరుపతయ్య,ఇప్పాయిపల్లి మాజీ సర్పంచ్ బాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు వడ్డే వెంకటయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ కుర్రంపల్లి నర్సింహులు,వార్డ్ మెంబర్ వెన్నచెటి అంజనేయలు, ఇందిరమ్మ గ్రామ కమిటీ సభ్యులు నీల రాఘవేందర్,కమ్మరి నర్సింహులు,జంగా మల్లయ్య, పటల మల్లయ్య,కుమార్,ఎంకంటే జగన్,జంగయ్య, బోరింగ్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# సుగూరు విద్యార్థి సబ్ జూనియర్ గర్ల్స్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

**ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు**



**పెబ్బేరు జూలై 02 క్రైమ్ మిర్రర్:** నిజామాబాద్ జిల్లాలో 3,4.5వ తేదీలలో జరగనున్న సబ్ జూనియర్ గర్ల్స్ రాష్ట్రస్థాయి ఫుట్బాల్ టోర్నమెంట్ కి పెబ్బేరు మండలం సూగూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 8వ తరగతి విద్యార్థిని జి శారద వనపర్తి జిల్లా సబ్ జూనియర్ గర్ల్స్ ఫుట్బాల్ జట్టుకు ఎంపిక అయినట్లు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఆర్ వెంకటరమణ తెలియజేశారు. ఇట్టి ఎంపికలను పిజెపి క్యాంప్ పెబ్బేరు ఫుట్బాల్ క్రీడా మైదానంలో బుధవారం జరిగాయని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎండి షబ్బీర్ తెలియజేశారు. క్రీడాకారిణి ఎంపిక పట్ల ఉపాధ్యాయుల బృందం విద్యార్థిని అభినందించారు.

# పి.ఆర్.సి తక్షణమే ప్రకటించకపోతే ఇక సమరమే!

## టి.ఎస్.యు టి.ఎఫ్ జిల్లా కార్యదర్శి, గేర నర్సింహ.

**క్రైమ్ మిర్రర్, నాంపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పిఆర్సి ప్రకటించకపోతే, పెండింగ్ డి.ఎ లు విడుదల చేయకపోతే, పెండింగ్ బకాయిలు చెల్లించకపోతే పోరాటమే శరణ్యమని, జూలై మొదటి వారం నాటికి పి.ఆర్.సి రిపోర్ట్ తెప్పించుకొని వెంటనే ఉపాధ్యాయ, ఉద్యోగులకు ప్రకటించకపోతే రాష్ట్ర ప్రభుత్వంపై సమరం కొనసాగిస్తామని, ఉపాధ్యాయులంతా పోరాటాల్లోకి రావాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి గేర నరసింహ అన్నారు. నాంపల్లి మండలంలోని ఉన్నత పాఠశాల నాంపల్లి, పసునూరు, ముష్టిపల్లి, గట్లమల్లేపల్లి, మహమ్మదాపురం, ఆదర్శ పాఠశాల పెద్దాపురం, కస్తూరిబా గాంధీ పాఠశాల మొదలైన పాఠశాలల్లో గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి గేర నర్సింహ మాట్లాడుతూ ప్రతి ఊరు, ప్రతి తండా, గూడెం లలో స్కూల్ ఉండడం నా ధ్యేయం అని ముఖ్యమంత్రిగా ప్రకటించిన విషయాన్ని మరిచి, స్కూల్స్ సంఖ్యను కుదిస్తామని రేవంత్ రెడ్డి అనడం సమంజసం కాదని 27 వేల పాఠశాలలను 4 వేలకు తగ్గిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించడం పాఠశాల విద్యావ్యవస్థను నిర్వీర్యం చేయడమేనని, ఈ కుదింపు చర్యలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని, ఉపాధ్యాయ సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేసిన విధంగానే, ప్రస్తుత ప్రభుత్వం కూడా నిర్లక్ష్యం చేస్తోందని, కేవలం ఒకటో తేదీన జీతాలు చెల్లించడమే గొప్ప అని చెప్పుకుంటోందని, ఒకటో తేదీన వేతనం పొందడం తమ హక్కు అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను




పెంచుకుంటూ పోవడం వల్ల నిత్యవసర ధరలు కొండెక్కుతున్నాయని తద్వారా వేతన జీవుల వెతలు రోజు రోజుకు పెరుగుతున్నాయని అన్నారు. తక్షణమే పెండింగ్ బకాయిలు, డి ఏ లను విడుదల చేయాలని, వేతన సవరణ కమిషన్ రిపోర్టు ప్రకటించి, మంచి ఫిట్మెంట్ తో వేతన సవరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సందర్భంగా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలైన సి పి ఎస్ రద్దు చేయడం, 317 జీ వో బాధితులను సొంత జిల్లాలకు కేటాయించడం తక్షణమే చేపట్టాలని అన్నారు. పాఠశాలల పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయుటకు ఎంఈఓ, డిప్యూటీ ఈ ఓ పోస్టులను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలని, మోడల్ స్కూల్, కేజీబీవీ, యు ఆర్ ఎస్ లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కారం పరిష్కరించాలని, కేజీబీవీ సమగ్ర శిక్షణ సిబ్బందికి మినిమం బేసిక్ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీ గురుకుల, గిరిజన గురుకుల పాఠశాలల టైం టేబుల్ ను మార్చాలని, ఇన్ సర్వీస్ టీచర్స్ కి సబ్జెక్టుల వారీగా ప్రత్యేక టెట్ ని నిర్వహించి, అర్హత మార్కులను కుదించాలని డిమాండ్ చేశారు. కేంద్రం ఇచ్చిన మెమో నెంబర్ 57 ప్రకారం 2004 సెప్టెంబర్ కు ముందు నియామకం అయిన 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు నెలలో బదిలీలు, పదోన్నతులు నిర్వహించాలని, హెల్త్ కార్డుల మార్గదర్శకాలు, ప్రభుత్వ ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి మండల అధ్యక్షులు జింకల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి, కస్పరాజు వెంకన్న, ఉపాధ్యక్షుడు పల్లేటి వెంకటయ్య, కోశాధికారి శ్రవణ్ కుమార్, ఎఫ్.డబ్ల్యూ.ఎఫ్ కన్వీనర్ యాదయ్య, సీనియర్ నాయకులు మహేశ్వరం వెంకటేశ్వర్లు, చింతపల్లి మండల నాయకులు దొడ్డి నరసింహ, బక్క దివంత, గ్యార సంపత్, గాదపాక వేలాద్రి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# యశోద హాస్పిటల్స్ వైద్యుల ఘనత

## అత్యంత క్లిష్టమైన గుండె శస్త్రచికిత్స విజయవంతంలి

## 60ఏళ్ల వనపర్తి వ్యక్తికి విజయవంతంగా అరుదైన హై-రిస్క్ హార్ట్ బైపాస్ శస్త్రచికిత్స

క్రైమ్ మిర్రర్ వనపర్తి ప్రతినిధి: హైదరాబాద్, మలక్ పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అత్యంత క్లిష్టమైన లెఫ్ట్ మెయిన్ కొరోనరీ ఆర్టరీ వ్యాధితో బాధపడుతున్న 60ఏళ్ల వ్యక్తికి అరుదైన బీటింగ్ హార్ట్ బైపాస్ శస్త్రచికిత్స విజయవంతంగా చేసినట్లు మలక్ పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కన్సల్టెంట్ కార్డియాలజీ ఒ వాస్క్యులర్ సర్జన్ డా. వెంగల్ రెడ్డి తెలిపారు.గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలో మలక్ పేట యశోద ఆసుపత్రి వారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.వనపర్తి జిల్లాకు చెందిన 60 ఏళ్ల ఎస్.కృష్ణప్రసాద్కు గత ఆరు నెలలుగా ఎడమవైపున ఛాతీ నొప్పితో బాధపడుతున్నాడు.రోగికి నిర్వహించిన పరీక్షల్లో లెఫ్ట్ మెయిన్ కొరోనరీ ఆర్టరీ డిసీజ్, ట్రిపుల్ వెసెల్ డిసీజ్, టైప్-2 మధుమేహం ఉన్నట్లు వైద్యులు గుర్తించారు.ఇలాంటి గుండె ప్రధాన ధమని సహా పలు రక్తనాళాల్లో తీవ్రమైన అడ్డంకులు ఉన్నట్లు తేలడంతో వెంటనే బైపాస్ శస్త్రచికిత్స అవసరమని వైద్యులు నిర్ణయించారు.అత్యాధునిక గుండె శస్త్రచికిత్సను యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కన్సల్టెంట్ కార్డియోథొరాసిక్ ఒ వాస్క్యులర్ సర్జన్ డా. వెంగల్ రెడ్డి ఎస్. ఆధ్వర్యంలో రోగికి ఆఫ్-పంప్ కొరోనరీ ఆర్టరీ బైపాస్ గ్రాఫ్టింగ్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కన్సల్టెంట్ కార్డియోథొరాసిక్ ఒ వాస్క్యులర్ సర్జన్ డా. వెంగల్ రెడ్డి




మాట్లాడుతూ...లెఫ్ట్ మెయిన్ కొరోనరీ ఆర్టరీలో తీవ్రమైన అడ్డంకి ఉన్న రోగులు అత్యంత ప్రమాద స్థితిలో ఉంటారని తెలిపారు.ఇలాంటి కేసుల్లో వేగవంతమైన నిర్ధారణ,ఖచ్చితమైన శస్త్రచికిత్స ప్రణాళిక,అత్యాధునిక మౌలిక సదుపాయాలు, నిపుణుల సమన్వయం ఎంతో అవసరమని పేర్కొన్నారు.అత్యాధునిక కార్డియాక్ ఆపరేషన్ థియేటర్లు, ప్రత్యేక కార్డియాక్ ఐసీయూలు, ఆధునిక ఇమేజింగ్ సాంకేతికత,అనుభవజ్ఞులైన కార్డియాలజిస్టులు, కార్డియాక్ సర్జన్లు, క్రిటికల్ కేర్ నిపుణుల సమన్వయంతో అత్యంత క్లిష్ట గుండె వ్యాధులకు కూడా విజయవంతమైన చికిత్స అందిస్తున్నామని తెలిపారు.ప్రపంచస్థాయి వైద్య ప్రమాణాలతో, రోగి-కేంద్రిత వైద్య సేవలతో అత్యుత్తమ ఫలితాలు సాధించడం యశోదా ఆసుపత్రుల లక్ష్యమని వారు స్పష్టం చేశారు.మరిన్ని వివరాల కోసం ఎ. వాసుకిరణ్ రెడ్డి -- 97057 71230 / 99499 98378 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

# జూలై 10న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బందును విజయవంతం చేయాలి

## పరిగి కొడంగల్ చౌరస్తాలో పోస్టర్ విడుదల చేసిన ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు.

క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:విద్యారంగ సమస్యల పరిష్కారాన్ని కాంక్షిస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల జూలై 10న చేపట్టబోయే రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ ను విజయవంతం చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర సభ్యులు ఆకాష్ నాయక్, ఎస్ఎఫ్ఐ పరిగి మండల అధ్యక్షులు గుర్రంపల్లి శివ సూచించారు. పరిగి నియోజకవర్గ కేంద్రంలోని కొడంగల్ చౌరస్తాలో విద్యార్థి సంఘాల నాయకులు కలిసి గురువారం పోస్టర్ను విడుదల చేశారు.?ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. జూలై 10న జరగబోయే విద్యాసంస్థల బంద్ను విద్యాసంస్థల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.ప్రభుత్వ నింబంధనలు పాటించని పాఠశాల గుర్తింపులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ?ఫీజుల దోపిడీని అరికట్టాలి ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఇష్టారాజ్యంగా పెంచిన ఫీజుల దోపిడీని వెంటనే అరికట్టాలి.కౌన్సిలింగ్ ద్వారా భర్తీ బి-కేటగిరి సీట్లను పారదర్శకంగా కౌన్సిలింగ్ ద్వారా మాత్రమే భర్తీ



చేయాలి. ప్రభుత్వ యూనివర్సిటీలను కాపాడాలని,విద్యను అందరికీ అందుబాటులో ఉండేలా ప్రజల హక్కుగా మార్చాలి.విద్యారంగంలో పేరుకుపోయిన సమస్యలను ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కరించాలి. విద్య అందరి హక్కు వ్యాపారం కాదు అనే ఏకైక నినాదంతో విద్యా రంగాన్ని కాపాడుకోవడానికి ఈ పోరాటం చేస్తున్నట్లు వారు స్పష్టం చేశారు. ఖాళీగా ఉన్న టీచర్ ఎంఈఓ డిఇఓ లెక్చరర్స్ పోస్టులను భర్తీ చేయాలి. పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేసి జీవో నెంబర్ 7 8 9 రద్దు చేయాలి. ఎన్ఈపి 20-20 తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలని,కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేసి ఐదు లక్షల విద్య భరోసా కార్డులు ఉచిత ల్యాప్టాప్ లు అందించాలి. అద్దె భవనాల్లో నడుస్తున్న పాఠశాలలు హాస్టల్స్ గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి. ఇంటర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసి తక్షణమే ప్రారంభించాలి. విద్య హక్కు చట్టం అమలు చేసి పేద విద్యార్థులకు 25% ఉచిత ప్రవేశాలు కల్పించాలి. రాష్ట్రంలో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలి. అని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ హెచ్చరించారు.?ఈ కార్యక్రమంలో ఏఐఎస్, ఎస్ఎఫ్ఐ సంఘాల స్థానిక నాయకులు శ్రీను నాయక్, ఆకాష్ చవాన్, రాజేష్, మహేష్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# ఓటరు నమోదు కార్యక్రమం యుద్ధ ప్రాతిపదికన జరగాలి

### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్

### ఇప్పాయిపల్లి కుస్మసముద్రం గ్రామాలలో బిఎల్ఓ బిఎల్ఎలతో అన్యుమలేషన్ పత్రాలు అందజేత

క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: భారత ఎన్నికల కమిషన్ నిర్వహించిన సర్ ఓటరు నమోదు కార్యక్రమాన్ని అన్ని గ్రామాలలో యుద్ధ ప్రాతిపదికను జరిగించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్ సూచించారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలోని ఇప్పాయిపల్లి కుసుమ సముద్రం గ్రామాలలో బూతులెవన్ బిఎల్ఓ,బిఎల్ఎలతో కలిసి ఎన్యుమరేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగం ఇచ్చిన ఓటును ప్రతి పౌరుడు ఉపయోగించుకునే విధంగా ఓటర్ జాబితాలో నమోదు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, ఇప్పాయిపల్లి గ్రామ సర్పంచ్ ఎర్రం పోటి మల్లేష్, రాంపూర్ గ్రామ సర్పంచ్ చెక్కల తిరుపతయ్య, మాజీ సర్పంచ్ బాలెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు వడ్డే వెంకటయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ కుర్రంపల్లి నర్సింహులు, వార్డు సభ్యులు వెన్నచేతి ఆంజనేయులు, ఇందిరమ్మ గ్రామ కమిటీ సభ్యులు నీల రాఘవేందర్, పసుల మాధవులు, ఏంకంటి.జగన్ కుమార్ భవాని నర్సింలు, బోరింగ్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# హైవేలో ఒక్క సీసీ కెమెరా ప్రమాదాలను గుర్తించడంలో వంద మందితో సమానం

### పెబ్బేరు ఎస్ఐ వెంకటేష్ గౌడ్

**పెబ్బేరు జూలై 02 క్రైమ్ మిర్రర్:** నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు అవసరమని ఎస్ఐ వెంకటేష్ గౌడ్ అన్నారు. పెబ్బేరు మండలం మరియు పట్టణంలోని వివిధ ప్రధాన కూడలిలో సీసీ కెమెరాలను పోలీసులు ఏర్పాటు చేయగా పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేశారు.గత కొద్ది రోజులుగా పెబ్బేరు బైపాస్ రోడ్డులో అటు రంగాపూర్ వెళ్లే రూటు గాని ఇటు కొత్తకోట వెళ్లే రోడ్డు గానీ ఇటీవలి కాలంలో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి.. ఈ ప్రమాదాల నేపథ్యంలో రాత్రి సమయంలో నేషనల్ హైవేపై ఉన్న హైమాస్ట్ లైట్లు వెలుగుతున్నాయా లేదా అని సందేహంతో పెబ్బేరు ఎస్ఐ వెంకటేష్ గౌడ్ తన టీంతో కలిసి గురువారం సాయంత్రం హైవేపై ఉన్న లైటులను పరిశీలించారు. చాలా చోట్ల లైట్లు మరమ్మతులకు గురైనట్లు ఆయన గుర్తించారు. ఈ విషయాన్ని నేషనల్ హైవే అధికారులకు తెలియజేసి వాటిని పునరుద్ధరించేలా చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు.ఒక్క సీసీ కెమెరా 100మంది పోలీసులతో సమానమని తెలిపారు.ఠ



# ఏసీబీ వలలో డీఎస్పీ భీమ్ రెడ్డి.. భారీ అక్రమాస్తుల కేసు నమోదు

**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** తెలంగాణ పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ (పిసిఎస్ )లో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)గా విధులు నిర్వహిస్తున్న సంకిరెడ్డి భీమ్ రెడ్డిపై అక్రమాస్తుల కేసును అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) నమోదు చేసింది. తెలిసిన ఆదాయ వనరులకు మించి అవినీతి మార్గాల్లో భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు రావడంతో, అవినీతి నిరోధక చట్టం-1988 (2018 సవరణ)లోని సెక్షన్ 13(1)(బి), 13(2) కింద కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం (జూలై 2) ఏసీబీ అధికారులు భీమ్ రెడ్డి నివాసంతో పాటు ఆయన బంధువులు, స్నేహితులు, బినామీలు, అనుచరులకు చెందిన మొత్తం 16 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. సోదాల్లో హైదరాబాద్, గచ్చిబౌలి, మణికొండ, టెలికాం నగర్, తెల్లాపూర్, పటాన్చెరు, నాగోల్, మొమిన్పేట్, వికారాబాద్, సంగారెడ్డి, కర్ణాటక, బెంగళూరు దేవనహళ్లి తదితర ప్రాంతాల్లో విల్లాలు, ఇండ్లు, ఫ్లాట్లు, కమర్షియల్ భవనాల్లో వాటాలు, ప్లాట్లు, వ్యవసాయ భూములు, వ్యాపార పెట్టుబడులకు సంబంధించిన పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే సోదాల్లో సుమారు రూ.43.60 లక్షల నగదు, దాదాపు 2 కిలోల బంగారు ఆభరణాలు, 20 కిలోల వెండి వస్తువులు, సుమారు రూ.19.91 లక్షల బ్యాంకు నిల్వలు గుర్తించినట్లు ఏసీబీ వెల్లడించింది. స్వాధీనం చేసుకున్న స్థిరాస్తుల మార్కెట్ విలువ పత్రాల విలువ కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న పత్రాలు, ఆస్తుల వివరాలను పరిశీలిస్తూ దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు


# బార్బీక్యూ నేషన్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

## కుళ్లిన మాంసం, గడువు ముగిసిన ఆహార పదార్థాలు స్వాధీనం




**గండిపేట(క్రైం మిర్రర్):** ప్రముఖ రెస్టారెంట్ చైన్ బార్బీక్యూ నేషన్‌లోని తీవ్ర నిబంధనల ఉల్లంఘనలు మరోసారి వెలుగు చూశాయి. అత్తాపూర్‌లో గల బార్బీక్యూ నేషన్ రెస్టారెంట్‌పై హెచ్--ఫాస్ట్, ఫుడ్ సేఫ్టీ అధికారులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. ఫ్రిజ్‌లో కుళ్లిన మాసం, స్టిక్కర్లు మార్చి మాసం.. అధికారుల సోదాల్లో రెస్టారెంట్ కిచెన్‌లోపల తీవ్ర అపరిశుభ్రత వాతావరణం కనిపించింది. నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన పదార్థాలను అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పాడైపోయిన చికెన్, మూడు కేజీల మటన్, రెండు ఫిష్(చేపలు), గడువు ముగిసిన ఐస్‌క్రీమ్‌లు, కుళ్లిపోయిన పండ్లు గుర్తించారు. పాడైపోయిన, నిల్వ ఉన్న మాంసంపై పాత స్టిక్కర్లను తొలగించి, కొత్తగా ప్యాక్ చేసినట్లు భ్రమింపజేసేలా స్టిక్కర్లు మార్చి కస్టమర్లకు వడ్డిస్తున్నట్లు అధికారులు ఆధారాలతో సహా గుర్తించారు. గతంలోనూ ఇదే బార్బీక్యూ నేషన్ రెస్టారెట్‌పై ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేసి, తీవ్ర లోపాలను గుర్తించి నోటీసులు జారీ చేశారు. అయినప్పటికి యాజమాన్యం తీరులో ఎలాంటి మార్పు రాలేదని, ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని స్థానికులు మండిపడుతున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ, కుళ్లిన ఆహారాన్ని వడ్డిస్తున్న ఇటువంటి హోటళ్లపై కేవలం జరిమానాలతో సరిపెట్టకుండా, లైసెన్సులను రద్దు చేసి కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వినియోగదారుల ఆరోగ్యానికి హాని కలిగించేలా గడువు ముగిసిన, పాడైపోయిన మాంసాన్ని విక్రయిస్తున్నట్లు తనిఖీల్లో తేలిందని ఫుడ్ సేఫ్టీ అధికారి సౌమ్యరెడ్డి తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఆహార పదార్థాలను ల్యాబ్‌కు పంపిస్తున్నామన్నారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు.



# నకిలీ వీసాలతో మస్కట్ వెళ్తూ 20 మంది మహిళలు అరెస్ట్




**గండిపేట(క్రైం మిర్రర్):** హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (శంషాబాద్ ఎయిర్‌పోర్ట్) లో గురువారం ఒక పెద్ద మోసం వెలుగుచూసింది. నకిలీ వీసాల తో విదేశాలకు వెళ్లేందుకు ప్రయత్నించిన ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాకు చెందిన 19 మంది మహిళా ప్రయాణికులను ఇమ్మిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. శంషాబాద్ ఎసిపి శ్రీకాంత్ గౌడ్ ప్రకారం తూర్పుగోదావరి జిల్లాకు చెందిన 19 మంది మహిళలు ఒమన్ ఎయిర్‌లైన్స్ విమానంలో మస్కట్ వెళ్లేందుకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అయితే, ఇమ్మిగ్రేషన్ కౌంటర్ వద్ద అధికారులు వారి పాస్‌పోర్టులు, వీసాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో వారు చూపిస్తున్న వీసాలన్నీ నకిలీవని (ఫేక్ వీసాలు) అధికారులు గుర్తించారు. దీంతో వెంటనే ఆ 19 మంది మహిళలను ఇమ్మిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఇమ్మిగ్రేషన్ అధికారులు ఆ మహిళలను తదుపరి విచారణ నిమిత్తం ఎయిర్‌పోర్ట్ ఔట్‌పోస్ట్ పోలీసులకు అప్పగించారు. ప్రస్తుతం ఔట్‌పోస్ట్ పోలీసులు మహిళలను సుదీర్ఘంగా విచారిస్తున్నారు. పోలీసుల విచారణలో తాము అమాయకులమని, ఉపాధి కోసం విదేశాలకు వెళ్లేందుకు ఒక ఏజెంట్‌ను నమ్మి భారీగా డబ్బులు ఇచ్చామని మహిళలు కన్నీరుమున్నీరయ్యారు. ఆ ఏజెంట్ తమకు నకిలీ వీసాలు ఇచ్చి ఘోరంగా మోసం చేశాడని వారు పోలీసుల వద్ద వాపోయారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, సదరు నకిలీ వీసాలు సృష్టించిన ప్రధాన ఏజెంట్ ఎవరు? దీని వెనుక ఉన్న ముఠా ఎక్కడ ఉంది? అనే కోణంలో దర్యాప్తును వేగవంతం చేశారు.

# బోనాల పండుగ వేళ పోచమ్మ ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి

### జోనల్ కమిషనర్‌కు బీజేపీ వినతి



**గండిపేట(క్రైం మిర్రర్):** తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన పవిత్ర ఆషాఢ మాస బోనాల పండుగను పురస్కరించుకుని రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని వివిధ పోచమ్మ దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బీజేపీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పసుపుల సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో గురువారం రాజేంద్రనగర్ సర్కిల్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి కలిసి ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. బోనాల ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, దేవాలయాల వద్ద వీలైనంత త్వరగా మౌలిక వసతులు కల్పించాలని ఈ సందర్భంగా అధికారులు కోరారు. ఆలయాల పరిసరాల్లో దెబ్బతిన్న సిసి రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి, పండుగ సమయంలో పారిశుధ్య లోపం లేకుండా డ్రైనేజీ వ్యవస్థను సక్రమంగా నిర్వహించాలి, ఉత్సవాలకు భారీగా తరలివచ్చే భక్తుల కోసం ప్రత్యేకంగా తాగునీటి సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేయాలి, తెలంగాణ ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే బోనాల పండుగను భక్తులు సంతోషంగా జరుపుకునేలా జీహెచ్ఎంసీ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని నాయకులు కోరారు. జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించిన వారిలో బీజేపీ నాయకులు వై. శ్రీధర్, బొక్క బాల్ రెడ్డి, పవన్, రాజశేఖర్ రెడ్డి, సదానందం, పి. రవీందర్, యాదగిరి, రవి, వేణు, కిరణ్ , ఇతర పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అక్రమ అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదు

### కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్





**గండిపేట(క్రైం మిర్రర్):** బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అక్రమ అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదని కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ అన్నారు. కాంగ్రెస్ దొంగ మంత్రులు రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లక్షల కోట్ల అప్పు చేశారని హరీష్‌రావును ఉద్దేశించి మాట్లాడారన్నారు. గురువారం ఉదయం 10 గంటలకు తెలంగాణ భవన్‌కి వచ్చి నిరూపిస్తామని దొంగ మాటలతో దొంగమంత్రులు సవాల్ చేశారన్నారు. దీంతో ప్రతిసవాల్‌గా హరీష్‌రావు ఈ రెండున్నర సంవత్సరాలలో కాంగ్రెస్ ప్రభుత్వం లక్షల కోట్ల అప్పుతో పాటు కాంగ్రెస్ మంత్రులు దోచుకున్నది ఆధారాలతో నిరూపిస్తానని తెలంగాణ భవన వద్ద 11 గంటల వరకు కూర్చున్న రాని దొంగ మంత్రులకు మీరు రాకున్నా నేనే గన్‌పార్క్ అమరవీరుల స్తపం వద్దకు వస్తానని చెప్పారన్నారు. దీంతో కాటేదాన్ డివిజన్ నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. హరీష్‌రావు, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, పి.సబితాఇంద్రరెడ్డి, పి.కార్తీక్‌రెడ్డి, గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్దకు బయలుదేరుదుంగా అక్కడే ఉన్నపోలీసులు వారిని అరెస్టు చేసి కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లడంతో వారికి మద్దతుగా భారీ ఎత్తున బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌కి చేరుకోని పెద్ద ఎత్తున రోడ్డు మీద బైఠాయించి ఇక్కడికి వచ్చిన దొంగ మంత్రులు ఎక్కడ అని నినాదాలతో మారుమోగించారు. ఈ కార్యక్రమంలో కాటేదాన్ బీఆర్ఎస్ నాయకులు ముఖిద్‌చందా, బండ రాజేష్‌యాదవ్, ఉప్పల్ శ్రీను, శివ, రామునాయక్, బుషీతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శివరాంపల్లి ప్రశాంత్ కాలనీలో పడకేసిన పారిశుధ్యం

### సిబ్బంది కొరతతో ప్రజల తీవ్ర ఇబ్బందులు





**గండిపేట(క్రైం మిర్రర్):** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లి ప్రశాంత్ కాలనీలో పారిశుధ్య నిర్వహణ పూర్తిగా పడకేసింది. కాలనీలో పూర్తి స్థాయి పారిశుధ్య సిబ్బంది లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిత్యం చెత్తాచెదారం పేరుకుపోతుండడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రశాంత్ కాలనీలోని పలు వీధుల్లో, ఖాళీ స్థలాల్లో రోజుల తరబడి చెత్తను తొలగించకపోవడంతో కుప్పలుగా పేరుకుపోయింది. దీనికి తోడు డ్రైనేజీలు సరిగ్గా శుభ్రం చేయకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. దీంతో అటుగా వెళ్లే కాలనీవాసులు, వాహనదారులు తీవ్ర దుర్వాసనతో ముక్కున వేలేసుకుంటున్నారు. దోమలు, ఈగలు విపరీతంగా పెరిగిపోయి, రానున్న వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య సిబ్బంది కొరతపై జీహెచ్ఎంసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదని కాలనీ ప్రతినిధులు మండిపడుతున్నారు. వీధులను క్రమం తప్పకుండా ఊడ్చేందుకు, చెత్తను సకాలంలో తరలించేందుకు తగినంత మంది సిబ్బందిని కేటాయించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రశాంత్ కాలనీలో నెలకొన్న పారిశుధ్య సమస్యను జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు ప్రత్యేకంగా పరిశీలించాలని, వెంటనే పూర్తి స్థాయి సిబ్బందిని నియమించి కాలనీని శుభ్రం చేయించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో కాలనీవాసులంతా కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.




# ప్రేమావతిపేట్ ప్రభుత్వ పాఠశాలలో కార్పెట్ల పంపిణీ

**గండిపేట(క్రైం మిర్రర్):** తాము చదువుకుని ఉన్నత స్థానాలకు చేరిన తర్వాత పుట్టిన గడ్డకు, సమాజానికి తిరిగి ఏదో ఒకటి చేయాలనే 'పే బ్యాక్ టు సొసైటీ' నినాదంతో కేంద్ర ప్రభుత్వ సంస్థ ఐఐఓఆర్(డివోఆర్) ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ పి.ఎస్. శ్రీనివాస్ ఒక మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రాజేంద్రనగర్ పరిధిలోని ప్రేమావతిపేట్ గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆయన సొంత ఖర్చులతో కార్పెట్లను (కార్పేట్లు) పంపిణీ చేశారు. తాను కూడా బాల్యంలో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కాలేజీల్లోనే చదువుకున్నానని ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ గుర్తుచేసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎదురయ్యే కనీస వసతుల కొరతపై పూర్తి అవగాహన ఉండడంతో, విద్యార్థులు కింద మట్టిలో కూర్చోకుండా ఉండేందుకు తన వంతుగా ఈ చిన్న సహాయాన్ని అందించి పాఠశాలపై తనకున్న మక్కువను చాటుకున్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలో కీలకమైన శాస్త్రవేత్తగా విధులు నిర్వహిస్తూ కూడా, ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కష్టాలను గుర్తించి కార్పెట్లను అందజేసిన డా. పి.ఎస్. శ్రీనివాస్కి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మునీరా బేగం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఒక ఉన్నత హోదాలో ఉండి కూడా తన పాత రోజులను మర్చిపోకుండా, విద్యార్థులకు అండగా నిలవడం ఆయన గొప్ప మనసుకు నిదర్శనమని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు డి. సరిత, జై భీమ్ జై రామ్ సంఘం అధ్యక్షులు గోల్కొండ రాజు కుమార్, ప్రధాన కార్యదర్శి ఎడ్లకాడి సూర్యం, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మణికొండ మాజీ వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి ఇంట్లో ఏసీబీ సోదాలు

### డీఎస్పీ భీమ్‌రెడ్డి బినామీగా ఉన్నారనే అనుమానంతో దాడులు

**గండిపేట(క్రైం మిర్రర్):** రంగారెడ్డి జిల్లా మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి నివాసంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం ఉదయం నుండి ఆకస్మిక సోదాలు నిర్వహిస్తున్నారు. ఈ దాడులు రాజకీయ, అధికార వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఏసీబీ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు నరేందర్ రెడ్డి నివాసానికి చేరుకుని ఏకకాలంలో తనిఖీలు చేపట్టాయి. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఇప్పటికే తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటూ ఏసీబీ దర్యాప్తును ఎదుర్కొంటున్న డీఎస్పీ భీమ్ రెడ్డి వ్యవహారంలో ఈ సోదాలు ముడిపడి ఉన్నట్లు తెలుస్తోంది. డీఎస్పీ భీమ్ రెడ్డికి మణికొండ మాజీ వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి బినామీగా వ్యవహరించారనే బలమైన అనుమానాలతోనే ఏసీబీ అధికారులు ఈ దాడులు చేపట్టినట్లు నమ్మదగిన సమాచారం. సోదాల్లో భాగంగా నరేందర్ రెడ్డి ఇంట్లోని పలు కీలక పత్రాలు, డైరీలు, బ్యాంకు ఖాతాలు, ఇటీవలి కాలంలో జరిగిన భారీ ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఆస్తుల కొనుగోళ్లు, బినామీ పెట్టుబడులకు సంబంధించిన మరిన్ని ఆధారాలు సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈ సోదాలకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది.




Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.